హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0 । కనిష్ఠం 19.8



- జీవం కోల్పోయిన సీజన్ పూత
- ఈ ఏడాది దిగుబడులపై తీవ్ర ప్రభావం
- పెట్టుబడులు వచ్చేది కష్టమే

బత్తాయికి.. తామర ముప్పు

దశాబ్దకాలంగా వాతావరణంలో మార్పులు ఏర్పడుతున్నాయి. విత్తనం నాటిన నాటి నుంచి పంట కోతకు వచ్చే వరకు పురుగుల ఉధృతి అధికమైంది. ప్రతీ పంట సాగులోనూ ఎన్నో ఒడిదొడుకులు ఎదురవుతున్నాయి. ఉష్ణప్రాంత పంట అయిన బత్తాయి ప్రతికూల పరిస్థితులను కొంత మేరకు తట్టుకుంటుంది. అటువంటి బత్తాయి పంటకు కొత్త ముప్పు వచ్చి పడింది. ఇప్పటి వరకు మంగునల్లి, వేరుకుళ్లు వంటి ప్రమాదకరమైన తెగుళ్లను ఎదుర్కొంటున్న బత్తాయికి నల్ల తామర పురుగు ఆశించి తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ(వ్యవసాయం)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో బత్తాయి సాగవుతోంది. బత్తాయిలో ప్రధానంగా సీజన్ కాయ 80శాతం మేర దిగుబడి వస్తుంది. సాధారణంగా నవంబరులో వాడుకు వదిలి (బహెర్ పద్ధతి) డిసెంబరు నెలలో నీటి తడులు ఇవ్వడం ద్వారా జనవరి, ఫిబ్రవరిలో పూత దశకు వస్తుంది. ప్రస్తుతం బత్తాయి పూత దశ నుంచి మొగ్గకు చేరే దశలో ఉంది. ఈ సమయంలో నల్ల తామర పురుగు ఆశించి పూత జీవం కోల్పోయిందని రైతులు చెబుతున్నారు. బత్తాయిలో పూత 70-80 శాతం వరకు నుసిగా మారిపోయింది. ఎన్ని పురుగు మందులు పిచికారీ చేసినా పూతను కాపాడుకోలేక పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుంది. సాధారణంగా ఎకరానికి 6-8టన్నుల దిగుబడి వరకు వస్తుంది. ప్రస్తుతం రెండు టన్నులు కూడా రావని రైతులు వాపోతున్నారు. నాలుగేళ్లుగా కొంత మేర తామర పురుగు వ్యాప్తి ఉన్నా 20శాతం మేర మాత్రమే నష్టం వాటిల్లింది. ఏటా ఉధృతి పెరుగుతూ ఈ ఏడాది పూర్తిస్థాయిలో పంటకు వ్యాప్తించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. బత్తాయికి ఎకరానికి సుమారు రూ.50వేలకు పైబడి పెట్టుబడి అవుతుంది. ప్రస్తుతం బత్తాయిలో కత్తెరతోపాటు సీజన్ కాయలేకపోవడంతో కనీసం పెట్టుబడిలో పది శాతం మేర ఆదాయం వచ్చే పరిస్థితి లేదు.

సీజన్ పూత దెబ్బతిన్నది



బత్తాయి 10 ఎకరాల్లో సాగు చేస్తున్నా. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. వంద శాతం సీజన్ పూత వచ్చినా సుమారు 80శాతం పూత పిందె ఏర్పడే దశలో ఎండిపోయింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఎటువంటి మార్పులు రాలేదు. ఏటా సుమారు 80-100 టన్నుల వరకు సీజన్ బత్తాయి దిగుబడులు వచ్చేవి. ఈ ఏడాది పూర్తిస్థాయిలో పూత దెబ్బతినడంతో కనీసం 20 టన్నుల దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. - కరణం మల్లిఖార్జున్, రైతు, హాలియా

తామర పురుగుల ఉధృతితో పంటలకు నష్టం..

దండు ఆదర్శ్, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, గడ్డిపల్లి

తామర పురుగులు నాలుగేళ్లుగా మిరప పంటకు వ్యాపించి తీవ్ర నష్టాన్ని కలగజేస్తున్నాయి. ఈ ఏడాది మాత్రం బత్తాయిలో ఉధృతి అధికమైంది. పూతను ఆశించి నష్టాన్ని కలిగిస్తున్నారు. ఈ పురుగు కంటికి కనపడనంత చిన్నగా, నల్లగా అర సెంటీమీటర్ పరిమాణంలో ఉంటుంది. పురుగు గుడ్డు దశ నుంచి లార్వా దశకు చేరే సమయంలో ఆకులు, పూతలు, కాయలను ఆశించి రంపం వంటి నోటితో గీకి పత్రహరితాన్ని పీల్చేస్తుంది. ఇది ఆశించిన ఏ పంట అయినా పూర్తిస్థాయిలో దెబ్బతింటుంది. ఈ పురుగు దశ 20-25 రోజుల వరకు ఉంటుంది. పంటను ఆశించిన తరువాత భూమిలోకి చేరి కోశస్థ దశకు చేరుతుంది. 3-5 రోజుల తరువాత నిద్రావస్థ పూర్తి చేసుకుని పురుగు సంపర్కం చేసుకుని గుడ్లు పెడుతుంది. పిల్లపురుగులతో కలిసి తల్లి పురుగు పది రోజుల వ్యవధిలో పంటను మొత్తం ఆశించి నష్టం చేస్తుంది. ఉబ్బ, అధిక వేడి వాతావరణం ఈ పురుగు ఉధృతి పెరగడానికి కారణాలు.

నివారణ

- ప్రాథమిక దశలో ఈ పురుగు ఉధృతిని అరికట్టేందుకు వేప నూనె 10వేల పీపీఎం 2ఎంఎల్, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఫిప్రోనిల్ 2ఎంఎల్, స్పెనోషాడ్ 0.3ఎంఎల్, లీటర్ నీటికి, ఇమిడాఇప్రోనిల్ 0.3ఎంఎల్, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఎక్స్‌పోనస్‌గ్రేసియా ఎకరానికి 34ఎంఎల్, స్పైరాటెట్రామిల్ 1గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- జంప్ ఎకరానికి 40గ్రా. గుళికలు, (పిచికారీకి, నేలలో వేయడానికి ఉపయోగపడుతుంది)
- టెట్రామిల్ 1ఎంఎల్ లీటర్ నీటికి కలిపి, అదనంగా పంటకు 13-0-45, 19-19-19 మందులు 5-10 గ్రాముల వరకు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- గుళికలు చెట్టు వయసును అనుసరించి సరైన పరిమాణాన్ని అడుగు భాగంలో వేయాలి.
- పురుగు ఉధృతిని అనుసరించి ఆర్గానిక్ మందులు పిచికారీ చేయాలి. బవేరియా 5ఎంఎల్, వర్టిసేలియమ్ లకాన్ 5ఎంఎల్, వేప నూనె 5ఎంఎల్, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఒక వారం ఆర్గానిక్ మందులు, మరో వారం రసాయనిక మందులు పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

ఎరలు ఏర్పాటు

- సోలార్ దీపపు ఎరలు ఎకరానికి 4-5 ఏర్పాటు చేసుకోవాలి.
- నీలి రంగు జిగురు అట్టలు ఎకరానికి 20-30 ఏర్పాటు చేసుకుంటే పురుగుల ఉధృతిని అరికట్టవచ్చు.



చేనేత సహకార సంఘాలకు మళ్లీ ఇన్‌చార్జీలు

- మరో ఆరు నెలల గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు
- పర్సన్ ఇన్‌చార్జీలకు చేనేత సంఘాల బాధ్యతలు
- 12 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించని ప్రభుత్వాలు
- పాలకవర్గాలు లేక కునారిల్లుతున్న సంఘాలు

చేనేత సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జీలను మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వు లు జారీ చేసింది. జిల్లాలో 2013 ఫిబ్రవరిలో చేనేత సహకార సంఘాలకు చివరి సారిగా ఎన్నికలు జరిగాయి. 201 8 ఫిబ్రవరి 12వ తేదీతో ఈ పాలకవర్గాల ఐదేళ్ల గడువు ముగిసింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జీలను నియమించింది. పర్సన్ ఇన్‌చార్జీలతో సంఘాలు మొక్కుబడిగా నడుస్తుండగా, క్యాష్ క్రెడిట్ అంతంత మాత్రంగానే ఉన్నా పలు సంఘాలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి.

- (ఆంధ్రజ్యోతి భూదాన్‌పోచంపల్లి)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 84 సంఘాలు ఉండగా అందులో ఉత్సాహంగా పనిచేస్తున్న సంఘాలు పదికి మించి లేవు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని ఆశపడిన చేనేత వర్గాలకు నిరాశే మిగిలింది. పర్సన్ ఇన్‌చార్జీల పాలనను మరో ఆరు నెలలు ఈ ఏడాది జూలై 20వతేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చేనేత, మరమగ్గాలు, ఉన్ని పారిశ్రామిక సహకార సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించి పుష్కర కాలం దాటింది. 2013 ఫిబ్రవరి 12నసంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. పాలకవర్గాల పదవీకాలం ముగియగానే ఎన్నికలు నిర్వహించకుండా ప్రతీ ఆరు నెలలకోసారి ప్రభుత్వాలు పర్సన్ ఇన్‌చార్జీల పాలనను పొడగిస్తూ వచ్చాయి. పర్సన్ ఇన్‌చార్జీల పాలన గతనెల 21న ముగియడంతో తిరిగి మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో చేనేతసహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత నియమించిన పర్సన్ ఇన్‌చార్జీల పదవీ కాలాన్ని ఇప్పటి వరకు 13 దఫాలు పొడిగించారు.

ఎన్నికలు లేక సహకార సంఘాలు డీలా

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేస్తే కార్మికులకు పని దొరుకుతుంది. మార్కెటింగ్ అవకాశాలు పెంపొంది కార్మికులకు గిట్టుబాటు లభిస్తుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో...

- మిగతా 7వ పేజీలో...

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ వ్యాప్తంగా 200 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, జిల్లాలో 37 ఉన్నాయని, అందుకు 50 మంది ప్రిసైడింగ్ అధికారులను, 50మంది పోలింగ్ అధికారులను నియమించి, వారికి శిక్షణ కూడా పూర్తి చేశామన్నారు. 22,439 ఓటర్ స్లిప్‌లకు, 3,358 వరకు పంపిణీ చేశామని, మిగతావి ఈ నెల 25లోగా పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 4,182 ఓటర్ స్లిప్‌లకు, ఇప్పటివరకు 501 పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికలకు జంబో బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నామన్నారు. 28వేల బ్యాలెట్ పేపర్లను వినియోగిస్తామని, వాటిని ఇప్పటికే పరిశీలించామని, నియోజవర్గం పరిధిలోని మిగతా జిల్లాలకు శనివారం తరలిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు బీఎస్ఎన్ఎల్‌కు వర్క్ ఆర్డర్ ఇచ్చామన్నారు. నల్లగొండ పట్టణం సమీపంలోని ఆర్జాలబావి గోదాము వద్ద ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, దీన్ని ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రత్యక్షంగా సందర్శించి ఆమోదం తెలిపారన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవర్ మాట్లాడుతూ జిల్లాలో 37 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఐదు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. 13 రూట్లు ఏర్పాటు చేశామని, అందుకు 15 స్ట్రైకింగ్ ఫోర్సు, మూడు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 29 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 41 ఎంసీసీ బృందాలను నియమించామన్నారు. మొత్తం ఎన్నికల్లో 518 మంది పోలీసుల సేవలను వినియోగిస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు.

మాతా శిశు మరణాలు తగ్గాలి : కలెక్టర్

మాతా శిశు మరణాలను తగ్గించేందుకు కారణాలను విశ్లేషించాలని వైద్యాధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. మాతా శిశు మరణాలు సంభవిస్తే దీన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ విషయంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలది కీలకపాత్ర అని తెలిపారు. ఎక్కడైనా మాతా శిశు మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కట్టంగూరు, లైన్‌వాడ, కేతపల్లి, చిట్యాల, కనగల్, రాములబండ, మాన్యంచెల్క తదితర ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పరిధిలో గత ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు సంభవించిన మాతా శిశు మరణాలను సమీక్షించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ వందన, డాక్టర్ స్వరూపారాణి, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించాలి

హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్స్, బడ్డీ కొట్లు తదితర ప్రదేశాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్థాయి ఆహార భద్రత సమావేశంలో ఆమె మాట్లాడారు. చికెన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి సంయుక్తంగా పనిచేయాలన్నారు. ఫుడ్ సేఫ్టీ జోనల్ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాలో 16 కేసులు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి స్వాతి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ కోటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీఏ శ్రావణ్, డీఈవో భిక్షపతి, ఎస్పీ డీఎస్పీ రమేష్, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాణించాలి

(ఆంధ్రజ్యోతి, మునుగోడు): విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో విద్యలో రాణిస్తేనే భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. చదువుకునే సమయంలో సెల్‌ఫోన్లను వాడటం సరికాదని అన్నారు. శుక్రవారం సాయంత్రం మునుగోడు బీసీ బాలుర, బాలికల హాస్టళ్లు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్ కార్యాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి చాక్లెట్ పంచారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ నరేందర్, తదితరులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా పంచ వింశతి కలశ స్నపనం

- మూడో రోజు మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు
- సీఎం పర్యటన ఖరారు.. ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



•7లో..

'కోడ్' మారడంతో

నిలిచిన రుణమాఫీ

- జనవరి 1న ఏపీజీవీబీ నుంచి టీజీబీలో విలీనం
- మారిన ఐఎఫ్ఎస్ కోడ్
- ఖాతాల్లో జమకాని వైనం



•6లో..

నేడు 'మీట్ యువర్' ఎస్పీ

డిండి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం డిండి పోలీస్‌స్టేషన్‌లో శనివారం 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించే దిశగా ఉదయం 11 గంటలకు డిండి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమానికి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హాజరవుతారని తెలిపారు. బాధితుల ఫిర్యాదులు పరిశీలించి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. మండల ప్రజలు వారి సమస్యలపై ఎస్పీకి స్వయంగా ఫిర్యాదు చేయవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నర్సరీల్లో మొక్కలు ఎండకుండా చూడాలి : డీఆర్డీఏ



వన నర్సరీని పరిశీలిస్తున్న డిఆర్‌డిఏ పీడీ

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో మొక్కలు ఎండకుండా చూడాలని డీఆర్డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోల్‌ముంతలపహాడ్ గ్రామ పరిధిలోని వన నర్సరీని ఆయన పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, నీటిని అందించే విధానంపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజురెడ్డి, ఏపీవో రామచంద్రనాయక్, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, పలు పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు, సర్వీస్ రూల్స్ సాధనే ధ్యేయం

ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్ రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు, 317 పరిష్కారం, సర్వీస్ రూల్స్ సాధనే ధ్యేయంగా పని చేస్తానని వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్ రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక లయన్స్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్య పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని అన్నా రు. దశాబ్ద కాలంగా ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతూ, 18కి పైగా పోలీస్‌కేసులను అనుభవిస్తూ ఉద్యో గం, పెన్షన్ లేకున్నా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పనిచేశానన్నారు. రానున్న రోజుల్లో సీపీఎస్ రద్దు, 317 పరిష్కారం, ఉమ్మడి సర్వీసు రూల్స్, హెల్త్‌కార్డ్స్, పెండింగ్ డీఏలు, మంచి పీఆర్సీ సాధన లక్ష్యంగా ముందుకుసాగుతానన్నారు. గురుకుల ఉపాధ్యాయులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి 010 పద్దు కింద వేతనాలు, హెల్త్‌కార్డులు, ఇద్ద రు హాస్టల్ వార్డెన్లను ఇప్పించడం, వచ్చే విద్యా సంవత్సరంలో 9గంటలకు పాఠశాల సమయాన్ని కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. జేఎల్, డీఎల్‌లకు గెజిటెడ్ హోదా, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 వేతనా లు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పేస్కేల్ వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పించేందుకు కృషిచేస్తానన్నారు. కేజీబీవీలో పనిచేసేవారికి పేస్కేల్, రూ.10లక్షల వరకు హెల్త్‌కార్డులు ఇప్పిస్తానన్నారు. ఎయిడెడ్ పాఠశాలను ప్రభుత్వ పాఠశాలల్లో కలపాలని మేనిఫెస్టోలో డిమాండ్ ఉంచామన్నారు. అదే విధంగా ప్రైవేట్‌విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకులకు ఆయా విద్యా సంస్థలు కూడా సమాన పనికి సమాన వేతనం కల్పించడం, జీపీఎఫ్ సౌకర్యం, హెల్త్ కార్డులు, గుర్తింపు కార్డులు, బ్యాంకుల ద్వారా వేతనాల కోసం కృషిచేస్తానన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉమాకర్‌రెడ్డి, వెంకన్న, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసీ కాల్వలకు నీటి విడుదల

- 15 రోజులపాటు కొనసాగనున్న నీటి కొనసాగింపు

7

కుమార్తెపై లైంగికదాడి కేసులో

తండ్రికి 20ఏళ్ల జైలు

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కుమార్తెపై లైంగికదాడి కేసులో తండ్రికి 20ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించారు. కోర్టు తీర్పుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి(42) 2023 సంవత్సరం డిసెంబరు 14వ తేదీన ఆరో తరగతి చదువుతున్న తన కుమార్తెపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో లైంగికదాడి చేశాడు. ఈ విషయమై ఎవరికీ చెప్పవద్దని బెదిరించాడు. బాలిక తల్లి పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి గమనించి అడగ్గా కుమార్తె జరిగిన విషయం వివరించింది. ఘటనపై వెంటనే ఆమె కుమార్తెతో కలిసి పోలీసులకు ఫిర్యాదుచేసింది. అప్పటి ఎస్ఐ రాఘవరావు నిందితుడిపై పోక్సో కేసు నమోదుచేసి సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. వెంటనే నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. 2024 జనవరిలో నిందితుడు బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఈ కేసుకు సంబంధించి అప్పటి ఎస్ఐ దూది రాజు, ప్రస్తుత సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ రవీందర్ సరైన ఆధారాలను కోర్టుకు సమర్పించారు. శుక్రవారం కేసును విచారించిన పోక్సో ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయాధికారి కులకర్ణి విశ్వనాథ్ దిలీప్‌రావు తీర్పును వెలువరించారు. నిందితుడిని దోషిగా నిర్ధారించి 20ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ ప్రకటనలో పేర్కొన్నారు. సరైన ఆధారాలు సేకరించి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేసిన పోలీసు అధికారులతో పాటు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్, సీడీవో రువ్వ నాగరాజు, ఎం.కల్పన, లైజనింగ్ ఆఫీసర్లు పాక నరేందర్, ఎన్.మల్లిఖార్జున్‌లను ఎస్పీ అభినందించారు. తీర్పు అనంతరం నిందితుడిని నల్లగొండలోని కేంద్ర కారాగారానికి తరలించారు.

చెట్టుపైనే ప్రాణాలొదిలిన రైతు


భాస్కర్(ఫైల్)

తిప్పర్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం మర్రిగూడెంలో విద్యుదాఘాతంతో శుక్రవారం మధ్యాహ్నం రైతు మృతి చెందాడు. ఎస్ఐ సాయిప్రశాంత్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మర్రిగూడెం గ్రామానికి చెందిన రైతు సింగం భాస్కర్(50) తనకున్న నాలుగు ఎకరాల్లో వరి సాగు చేయడంతో పాటు గొర్రెల పెంపకం చేస్తున్నాడు. ఈ క్రమంలో గొర్రెల మేత కోసం తన నివాసానికి దగ్గరలోని సోమరాజు చెరువు పక్కన ఉన్న తుమ్మ చెట్టుకు మండలు కొట్టేందుకు పైకి ఎక్కాడు. ఈ క్రమంలో ఒక మండ పూర్తిగా చెట్టు నుంచి వేరు కాకుండానే అదే చెట్టు పక్కన వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగలపై పడింది. ఆ మండ పచ్చిగా ఉండటం, ఈ క్రమంలో రైతు భాస్కర్ విద్యుదాఘాతానికి గురై చెట్టుపైనే మృతిచెందాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. భాస్కర్‌కు భార్య కళమ్మతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్నకుమారుడు సింగం భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు రోజులుగా షెడ్‌లోనే మృతదేహం


వృద్ధురాలి మృతదేహం

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి): మనుషుల్లో మానవత్వం కరు వైంది. గుర్తుతెలియని ఓ మహిళ ఆసు పత్రి ఆవరణలో మృతి చెంది రెండు రోజులైనా పట్టించుకునేవారు కరువ య్యారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆసుపత్రి వెలుపల ఉన్న రోగుల సహాయకులు వేచి ఉండే షెడ్డులో(అమృత మెడి కల్ హాల్ పక్కన)ఓ మహిళ మృతదేహాన్ని కొంతమంది శుక్రవారం గుర్తించారు. ఇదే విషయాన్ని సిబ్బంది, అధికారులకు తెలియజేయడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ విషయమై సిబ్బంది మాట్లాడుతూ కొంతమంది యాచకులు రోగుల సహాయకులు వేచి ఉండే షెడ్డులో రాత్రి వేళ నిద్రిస్తుంటారని, అదే తరహాలో మహిళ అనారోగ్యంతో మృతిచెంది ఉంటుందని చెబుతున్నారు. రెండు రోజుల క్రితం మహిళ మృతిచెందినట్లుగా భావిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఆసుపత్రి పరిసరాల్లో రెండు రోజులుగా మృతదేహం నుంచి దుర్వాసన వస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంపై రోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామని, మృతదేహాన్ని గుర్తించిన వారు ఎస్ఐ నంబర్ 8712670176, స్టేషన్ నంబర్ 87126 67671ను సంప్రదించాలని ఔట్‌పోస్టు పోలీసులు సూచించారు.

యువకుడి అనుమానాస్పద మృతి


సాయిరామ్ (ఫైల్‌ఫొటో)

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఎస్ఐ ముత్తయ్య శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాయిప్రభాత్‌నగర్‌కు చెందిన తుమ్మలపల్లి సాయిరామ్(33) హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉంటూ ఫిల్మ్ ఇండస్ట్రీలో కెమెరామన్‌గా పనిచేస్తున్నాడు. సాయిరామ్ గురువారం స్నేహితుడైన నరేష్‌తో కలిసి మిర్యాలగూడలోని సాయిరామ్ మామ సామనూరి నాగరాజు ఇంటికి కారులో వెళ్లాడు. అక్కడ కుమారుడు శ్రేయాంష్‌ను చూసి రాత్రి హుజూర్‌నగర్ పట్టణంలోని స్నేహితుడు నరేష్ బావ ఓరుగంటి శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో మద్యం తాగేందుకు డాబా పైకి అంతా ఎక్కారు. మద్యం తాగుతుండగా ప్రమాదవశాత్తు సాయిరామ్ పడిపోయాడని తలకు బలమైన గాయం కావడంతో చనిపోయాడని స్నేహితుడు నరేష్, అతడి బావ ఓరుగంటి శ్రీనివాస్ సాయిరామ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు తుమ్మలపల్లి పద్మావతి ఫిర్యాదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉమ్మడి పీఏపల్లి మండలంలో ఎక్సైజ్ తనిఖీలు

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా ఉమ్మడి పీఏపల్లి మండలంలోని మండలంలోని చిలకమర్రి, పలుగుతండా, చింతల్‌తండ గ్రామాల్లో సారాబట్టీలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం విస్తృతంగా దాడులు జరిపారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 15 లీటర్ల నాటుసారా, 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసంచేశారు. సారాబట్టీ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లేష్, కానిస్టేబుల్స్ నాగరాజు, శేఖర్‌రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

4 గంటలు..5 గ్రామాలు..6 చోరీలు

- గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లో వరుసబెట్టి చోరీలు
- తాళం వేసిన ఇళ్లే లక్ష్యం
- గడ్డిపల్లి, అప్పన్నపేట, నర్సయ్యగూడెం, గుడుగుండ్లపాలెం, కల్మెట్‌తండాలో దొంగతనాలు
- బైక్‌పై వచ్చి రూ.13.65 లక్షల సొత్తు చోరీలు

సూర్యాపేట జిల్లాలో శుక్రవారం మూడు మండలాల్లో చోరీలు జరిగాయి. బైక్‌పై వచ్చిన నిందితులు ఐదు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు కొనసాగిం చారు. రూ.13.65 లక్షల సొత్తు చోరీకి గురైంది.

గరిడేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో శుక్రవారం మూడు ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన సోమగాని లక్ష్మి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. శుక్రవారం ఉదయం వడ్డీకి రూ.50వేలు తీసుకువచ్చి ఇంట్లో పెట్టింది. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. ఆమె భర్త, కుమారుడు పనుల నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన కుమారుడికి ఇంట్లో నుంచి ఇద్దరు బయటకు రావడం గమనించాడు. ఎవరని ప్రశ్నించగా ఫైనాన్స్ వాళ్లమని చెప్పి వెళ్లిపోయారు. ఇంట్లోకి వెళ్లి గమనించిన కుమారుడు బయటకు వచ్చే సరికి ఇద్దరు బైక్‌పై పరారయ్యారు. అనంతరం తల్లి లక్ష్మి సమాచారం ఇవ్వడంతో ఇంటికి పరిశీలించగా 17 గ్రాముల బంగారం, 10 తులాల వెండి పట్టీలు, రూ.50 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీకి గురైన సొత్తు విలువ రూ.2.10 లక్షలు ఉంటుందని లక్ష్మి తెలిపింది. గడ్డిపల్లి గ్రామంలోని కరణం నాగేష్ కుటుంబ సభ్యులు బంధువుల పెళ్లికి పెన్‌పహాడ్ మండలకేంద్రానికి వెళ్లారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి మెయిన్‌గేట్ తాళం ధ్వంసం చేసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బంగారం విలువ రూ.1.76 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. అదే బజారులోని కోన శ్రీనయ్య ఇంటి తాళం వేసి బయటకు వెళ్లగా తాళం పగలగొట్టి ఇంట్లోని రూ.36 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితులు సోమగాని లక్ష్మి, కరణం నాగేష్, కోన శ్రీనయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మొత్తంగా ఒకే రోజు రెండు గ్రామాల్లో రూ.4.22 లక్షల సొత్తు చోరీకి గురైంది.

నర్సయ్యగూడెంలో 7.5 తులాల ఆభరణాలు..

నేరేడుచర్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణం 5వ వార్డు నర్సయ్యగూడెంలో శుక్రవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పేరం వెంకన్న, అతడి భార్య లింగమ్మ కూలిపనులకు వెళ్లగా ఇంట్లో ఎవరూలేరు.మధ్యాహ్న 12 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇద్దరు పల్సర్ బైక్ మీద వచ్చి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. 2.5 తులాల పుస్తెలతాడు, తులం దిద్దులు 2 జతలు, 1.5 తులాల ఉంగరాలు మూడు, తులం మాటీలు 2 జతలు, 1.5 తులాల మూడు ఉంగరాలు పోయాయని మొత్తం 7.5 తులాల బంగారు ఆభరణాలు సొత్తు చోరీకి గురికాగా వాటి విలువ సుమారు రూ.6.50 లక్షల ఉంటుందని ఎస్ఐ తెలిపారు. పేరం వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.క్లూస్‌టీంను పిలిపించి వివరాలు సేకరించారు.


నర్సయ్యగూడెంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

తాళం వేసిన రెండిళ్లలో

పాలకవీడు, ఫిబ్రవరి 21 (ఆంధ్ర్యజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు తాళం వేసిన ఇళ్లలో శుక్రవారం చోరీలు జరిగాయి. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం, కల్మెట్‌తండాలో గుండ్ర శ్రీనివాసరెడ్డి, బాణావత్ సైదాలు సొంత పనుల నిమిత్తం కుటుంబసభ్యులతో కలిసి బయటకువెళ్లారు. ఇదేఅదునుగా భావించిన దొంగలు శుక్రవారం మధ్యాహ్నం శ్రీనివాసరెడి ఇంట్లోని 12 తులాల వెండి, తులం బంగారం మొత్తం రూ.లక్ష విలువైన ఆభరణాలు, బాణావత్ సైదా ఇంట్లో తులంన్నర బంగారం, రూ.60 వేల నగదు చోరీ చేశారు. సుమారు రూ.1.93 లక్షల విలువైన సొత్తు చోరీకి గురైంది. సాయంత్రం ఇంటికి వచ్చిన యజమానులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి క్లూస్‌టీం ఆధారాలతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇద్దరు బైక్‌పై వచ్చి చోరీకి పాల్పడినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

● తాళం వేసిన ఇంట్లో చోరీ

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఉన్న ఉపాధ్యాయురాలి ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురంకాలనీలో గురువారం జరిగింది. బాధిత ఉపాధ్యాయురాలు, టూటౌన్ పోలీసులు శుక్రవారం చోరీకి సంబంధించి ఫిర్యాదు చేసింది. సీఐ నాగార్జున, ఉపాధ్యాయురాలు రషీదాబేగం తెలిపిన వివరాల మేరకు ఇంటికి తాళంవేసి ఉపాధ్యాయురాలు రషీదాబేగం పాఠశాలకు వెళ్లింది. పాఠశాల విధులు ముగించుకున్న అనంతరం సొంత పని మీద కుటుంబసభ్యులతో కలిసి బయటకు వెళ్లిన రషీదాబాగేం గురువారం రాత్రి ఇంటికి చేరుకుంది. అయితే ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో స్థానికులతో కలిసి పరిశీలించింది. ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండటంతో పాటు సుమారు ఐదు తులాల బంగారునగలు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ ఎస్ఐ రాంబాబు ఇంటిని పరిశీలించారు. శుక్రవారం నల్లగొండ నుంచి వచ్చిన క్లూస్‌టీం తనిఖీలు జరిపి ఆధారాలు సేకరించింది. ఉపాధ్యాయురాలు రషీదాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జున తెలిపారు.

పండుగకు వచ్చి వెళుతుండగా విషాదం


నందిని(ఫైల్‌ఫొటో)

చౌటుప్పల్‌రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా, భర్తకు గాయాలయ్యాయి. వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ అతివేగంతో ఢీకొట్టటంతో ఈ ప్రమాదం జరిగింది. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాలి ఉన్నాయి. చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కొయ్యడ సత్యనారాయణ భార్య నందిని(40)తో కలిసి హైదరాబాద్‌లోని నాగోల్‌లో నివాసం ఉంటున్నారు. నందిని నాగోల్‌లో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తోంది. శుక్రవారం వలిగొండ మండలం గొల్నేపల్లిలో గ్రామ దేవతల పండుగ సందర్భంగా బంధువుల ఇంటికి వెళ్లి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయలుదేరారు. చౌటుప్పల్‌లోని వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద వీరిద్దరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కంటెయినర్ లారీ అతివేగంతో ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్య నందినిపైకి లారీ ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సత్యనారాయణకు గాయలయ్యాయి. మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు కాగా, హైదరాబాద్‌లో చదువుతున్నారు. నిత్యం వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద విపరీతమైన ట్రాఫిక్ ఉన్నా పట్టించుకోకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిర్యాలగూడలో కంటైనర్ బీభత్సం

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి - నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై వేగంగా దూసుకొచ్చిన కంటైనర్ బీభత్సం సృష్టించింది. డ్రైవర్ అజాగ్రత్తతో అదుపుతప్పిన వాహనం ఓ వ్యక్తిని బలిగొనగా, రెండు డీసీఎంలారీలను, ఒక ఆటోతో పాటురోడ్డుపక్కనే ఉన్న టీస్టాల్‌ను ఢీకొట్టడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు చౌరస్తా వద్ద శుక్రవారం జరిగింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణంలోని పట్టణంలోని శరణ్యగ్రీన్‌హోంకు చెందిన పెట్నుకోటి భరతయ్య(83) స్కూటీపై నందిపాడు జంక్షన్‌వద్ద రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో గుంటూరు నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్న ఎంహెచ్04 కేఎఫ్ 8358 నెంబరుగల కంటైనర్ లారీ అతివేగంగా దూసుకొచ్చి స్కూటీని ఢీకొట్టింది. అంతే వేగంతో దూసుకెళ్లిన కంటైనర్ రోడ్డు పక్కన పార్క్ చేసిన రెండు డీసీంలను, అటుగా వెళ్తున్న మరో ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న భరతయ్యకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడు. రోడ్డుపక్కన ఆగి ఉన్న డీసీఎంలు స్వల్పంగా దెబ్బతినగా ఆటో డ్రైవర్ ధనుంజయ్య కాలు విరిగింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. భరతయ్య మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి, ప్రమాదానికి కారణమైన కంటైనర్‌లారీ డ్రైవర్ రికేష్‌చౌబేను అదుపులోకి తీసుకున్నారు. భరతయ్య భార్య ఎనిమిది నెలల కిందట అనారోగ్యంతో మృతిచెందింది. దివ్యాంగురాలైన కుమార్తెతో కలిసి శరణ్యగ్రీన్‌హోంలో నివాసముంటున్నాడు. ఆయన కుమారుడు రమేష్ కరీంనగర్ జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. భరతయ్య కుమారుడు రమేష్, ఆటోడ్రైవర్ ధనుంజయ్య ఫిర్యాదు మేరకు కంటైనర్ లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ రాంబాబు తెలిపారు. కాగా శరణ్యగ్రీన్‌హోమ్స్‌కాలనీ కమిటీ శాశ్వతసభ్యుడిగా కొనసాగుతున్న భరతయ్య అకాలమృతితో కాలనీలో విషాదఛాయలు నెలకొన్నాయి. పెద్ద దిక్కును కోల్పోయామంటూ కాలనీవాసులు కన్నీటి పర్యంతమయ్యారు.




భరతయ్య(ఫైల్ ఫొటో), డీసీఎంను ఢీకొన్న కంటైనర్

ఎక్సైజ్ ఇన్‌ఫార్మర్‌గా గ్రామస్థులు వేధిస్తున్నారు

కార్యాలయం ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలాజీ

హుజూర్‌నగర్ , ఫిబ్రవరి 21 (అంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఎక్సైజ్ కార్యాలయం ఎదుట గిరిజన యువకుడు శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎక్సైజ్ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా భావించి గ్రామస్థులు తనను వేధిస్తున్నారని, గ్రామానికి వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న యువకుడి స్నేహితులు ఓ ప్రైవేట్ ఆసుత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గత నెలలో మఠంపల్లి మండలం రామచంద్రాపురంతండాలో ఎక్సైజ్ అధికారులు నాటుసారా స్థావరాలపై తనిఖీలు చేసి పెద్దమొత్తంలో నాటుసారాను స్వాధీనం చేసుకుని, బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనలో 10మందిపై కేసులు నమోదుచేశారు. ఇదిలా ఉండగా తండాలో నాటుసారా తయారీ విషయాన్ని యువకుడు ఆంగోతు బాలాజీ ఎక్సైజ్ పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా మారి సమాచారం చేరవేస్తున్నాడని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. ఇదే విషయంలో బంధువులు, గ్రామస్థులు కొందరు ఆరోపణలు చేసి వేధిస్తుండటంతో బాలాజీ ఎక్సైజ్ పోలీసులను సంప్రదించాడు. ఎక్సైజ్ పోలీసుల తనిఖీలతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పాలని బాలాజీ కోరినా వారు పట్టించుకోలేదు. దీంతో బాలాజీ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చిన బాలాజీ మరోమారు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో తన వెంట తెచ్చుకున్న గన్నేరు రసం తాగి ఆత్మాహత్యాయత్నం చేశాడు. అక్కడే ఉన్న బాలాజీ స్నేహితుడు వెంటనే వచ్చి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి బాలాజీకి చికిత్స అందిస్తున్నారు.

తమకెలాంటి సంబంధం లేదు: సీఐ నాగార్జునరెడ్డి

మఠంపల్లి మండలం రామచంద్రాపురంతండాకు చెందిన గిరిజన యువకుడు ఆంగోతు బాలాజీ ఆత్మహత్యాయత్నానికి తమకెలాంటి సంబంధం లేదని హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. రామచంద్రాపురంలో నెలరోజుల క్రితం నాటుసారా స్థావరాలపై దాడులు చేశామన్నారు. ఆ దాడులకు కూడా బాలాజీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. కుటుంబ సభ్యుల సమస్యలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉండవచ్చన్నారు.

‘కోడ్’ మారడంతో నిలిచిన రుణమాఫీ

● జనవరి 1న ఏపీజీవీబీ నుంచి టీజీబీలో విలీనం ● మారిన ఐఎఫ్ఎస్ కోడ్ ● టీజీబీ రైతుల ఖాతాల్లో జమకాని వైనం ● ఇబ్బంది పడుతున్న రైతులు





తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక కూడా తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు(ఏపీజీవీబీ)లు కొనసాగాయి. అయితే ఇటీవల ఒక రాష్ట్రంలో ఒకే పేరుతో గ్రామీణ బ్యాంకులు ఉండాలన్న ఉద్దేశంతో రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకులను ఈ ఏడాది జనవరి 1న తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)లో విలీనం చేశారు. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏపీజీవీబీ బ్రాంచ్ లన్నీ తెలంగాణ గ్రామీణ బ్యాంకులుగా మారిపోయాయి. ఈ క్రమ ంలో బ్యాంక్ ఇండియన్ ఫైనాన్సియల్ సిస్టమ్(ఐఎఫ్ఎస్) కోడ్ మారడంతో రైతులకు రుణమాఫీ నిధులు జమకావడం లేదు.

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

ఏపీజీవీబీని తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్చడం మంచిదే అయినప్పటికీ పేరు మార్పుతో ఎదురవుతున్న ఇబ్బందులతో వినియోగదారులు సతమతమవుతున్నారు.ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన నాలుగో విడత రుణమాఫీ టీజీబీలో ఖాతాలు కలిగిన రైతులకు నిధులు జమకాక ఇబ్బంది పడుతున్నారు. తమ ఖాతాలో రుణమాఫీ నిధులు జమయ్యాయో లేదో అని తెలుసుకోవడానికి రైతులు రోజూ గ్రామీణ బ్యాంకు చుట్టూ తిరగాల్సి వస్తోంది.

విడతల వారీగా రుణ మాఫీ

రాష్ట్ర ప్రభుత్వం మొదట రూ.లక్ష, రెండో విడత రూ.1.50లక్షలు, మూడో విడత రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసింది. రేషన్‌కార్డులు లేని వారికి, పేర్లు, ఆధార్ నంబర్లు, ఖాతా నంబర్లు తప్పుపడిన వారికి రుణమాఫీ కాలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను ఏర్పాటుచేసి వ్యవసాయ శాఖ అధికారులతో రుణమాఫీ కాని రైతులు వివరాలు తీసుకుని, వారితో కలిసి ఫొటోలు దిగి 2024 నవంబరులో యాప్‌లో అప్‌లోడ్ చేశారు. తప్పులు సవరించారు. ఇదే సమయంలో గత నవంబరు 29న రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల లోపు రైతులకు రుణమాఫీ ప్రకటించింది.

పేరు మార్పు కారణంగా..

రాష్ట్ర ప్రభుత్వం గత నవంబరు 29న రూ.2 లక్షల్లోపు రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ జనవరిలో రైతుల ఖాతాల్లో నిధులు జమచేసింది. గ్రామీణ బ్యాంకు మినహా ఇతర బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న వారి ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమయ్యాయి. ఏపీజీవీబీ గత జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనమైంది. దీంతో ఆ బ్యాంకు ఐఎఫ్‌సీ కోడ్ మారిపోయింది. ఏపీజీవీబీ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం కాక ముందు ఆ బ్యాంకులో ఖాతాలు కలిగిన రైతుల నుంచి ఖాతా నంబర్లు, ఐఎఫ్ఎస్ కోడ్ తీసుకున్నారు. పేరు మార్పు కారణంగా ఐఎఫ్ఎస్ కోడ్ మారడంతో తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఖాతాలు కలిగి ఉన్న రైతులకు రుణమాఫీ నిధులు జమకావడం లేదు. ఆ నిధులు ప్రభుత్వానికి తిరిగి వెళ్లాయన్న ప్రచారం కూడా వినిపిస్తోంది. రుణమాఫీ కోసం టీజీబీ చుట్టూ రైతులు తిరిగిపోతున్నారు. బ్యాంకు అధికారులు రైతులకు రుణమాఫీ నిధులు ఖాతాలో జమ కాలేదని చెబుతున్నారే తప్ప జమ కాకపోవడానికి కారణం వివరించడంలేదు. దీంతో తమకు రుణమాఫీ అవుతుందా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. టీజీబీలో రుణమాఫీ జరగని విషయాన్ని వ్యవసాయ శాఖ అధికారులు లీడ్ బ్యాంకు మేనేజరు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇది రాష్ట్రవ్యాప్త సమస్య అయినందున రాష్ట్ర స్థాయిలోనే టీజీబీ రైతుల ఖాతాల ఐఎఫ్ఎస్ కోడ్ మార్చి నిధులు విడుదల చేసి, వారి ఖాతాల్లో జమ చేయాలని కోరినట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో సుమారు 10,500 మంది రైతులు

వివిధ కారణాలతో మూడు విడతల్లో రుణమాఫీ కాకుండా, తప్పుల సవరణ అనంతరం జరిగిన నాలుగో విడత రుణమాఫీలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో టీజీబీలో ఖాతాలు కలిగిన రైతులు సుమారు 10,500 మంది ఉన్నట్లు తెలుస్తోంది. రుణమాఫీ జాబితాలు అన్ని బ్యాంకులవి కలిసి ఉన్నందున ఖచ్చితమై సంఖ్యను అధికారులు చెప్పలేకపోతున్నారు. రుణమాఫీ జాబితాలో పేరు ఉండి, టీజీబీలో ఖాతా ఉండి రుణమాఫీ నిధులు జమకాని రైతులు నల్లగొండ జిల్లాలో సుమారు 4 వేల మంది, సూర్యాపేట జిల్లాలో 3,500 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 3 వేల మంది ఉంటారని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే టీజీబీలో ఖాతాలు కలిగిన తమకు రుణమాఫీ నిధులు జమచేయాలని రైతులు కోరుతున్నారు.

టీజీబీ ఖాతాలో డబ్బు జమకాలేదు



నాకు అనాజిపురంలో వ్యవసాయ భూమి ఉంది. పంట పెట్టుబడి అవసరాలకు ఏపీజీవీబీ(ప్రస్తుత టీజీబీ) మోత్కూరు బ్రాంచి నుంచి రుణం తీసుకున్నా. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,02,408 మాఫీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ రుణమాఫీ జాబితాలో నా పేరు ఉంది. అయనప్పటికీ టీజీబీలోని నా ఖాతాలో రుణమాఫీ నిధులు జమ కాలేదు. ఎన్నిసార్లు బ్యాంకుకు వెళ్లి అడిగినా ఖాతాకు డబ్బు జమ కాలేదని చెబుతున్నారే తప్ప ఎందుకు జమ కాలేదన్నది చెప్పడం లేదు. ప్రభుత్వం వెంటనే టీజీబీ ఖాతాదారులకు కూడా రుణమాఫీ నిధులు జమ చేయాలి.

● లోకసాని దివ్య, మహిళా రైతు, అనాజిపురం

లీడ్ బ్యాంకు మేనేజరు దృష్టికి తీసుకెళ్లాం

ఏపీజీవీబీ బ్యాంకు జనవరి 1న తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనమైంది. దీంతో ఆ బ్యాంకు ఐఎఫ్‌సీ కోడ్ మారింది. టీజీబీలో ఖాతాలు ఉన్న రైతుల ఖాతానంబర్లు ఏపీజీవీబీగా ఉన్నప్పుడు తీసుకున్నవి కావడంతో వారి ఐఎఫ్‌సీ కోడ్ పాతది ఉంది. దీంతో టీజీబీ రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమ కాలేదు. ఈ విషయాన్ని ఇటీవల మోత్కూరులో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజరు దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే బ్యాంకు ఐఎఫ్‌సీ కోడ్ మార్చి రుణమాఫీ నిధులు జమ చేస్తారు.

వీ కీర్తి, మండల వ్యవసాయాధికారి, మోత్కూరు

తల్లిదండ్రులకు విద్యార్థుల అప్పగింత

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు పాఠశాల నుంచి పారిపోయి వచ్చిన విద్యార్థులను శుక్రవారం తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ పటేల్‌నగర్ అంబర్‌పేట ఓ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు ఉపాధ్యాయులు తమను వేధిస్తున్నారని ఈ నెల 19న స్కూల్ నుంచి నేరుగా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండానే పారిపోయినట్లు సీఐ తెలిపారు. విద్యార్థులు నేరుగా సమీపంలోని రైల్లేస్టేషన్‌కు వెళ్లి రైలు మీద వరంగల్‌కు చేరుకున్నారు. పారిపోయిన విద్యార్థుల్లో ఒకరికి యాదగిరిగుట్ట మండలం దాతరుపల్లి గ్రామంలో దూరపు బంధువు ఉండటంతో ఆ గ్రామానికి చేరుకున్నారు. ఇదిలా ఉండగా తమ పిల్లలు రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వెళ్లి అడిగినప్పటి జాడ తెలియలేదు. బంధువులకు సమాచారం తెలిపిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో అదే రోజు రాత్రి అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదుచేశారు. మరుసటి రోజు ఉదయం దాతరుపల్లిలోని బంధువు విద్యార్థుల ఫొటోను పంపించి తనవద్దే ఉన్నారని సమాచారం ఇచ్చారు. దీంతో అంబర్‌పేట పోలీసులు గుట్ట పోలీసులకు తెలపడంతో వారు వెళ్లి పోలీస్‌స్టేషన్‌కు విద్యార్థులను తీసుకువచ్చారు. విద్యార్థులను విచారించగా పాఠశాలలో ఉపాధ్యాయులు వేధిస్తుండటంతో పారిపోయి వచ్చినట్లు చెప్పారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని హితవు పలికారు. అనంతరం తల్లిదండ్రులు అంబర్‌పేట పోలీసులతో గుట్ట పోలీస్‌స్టేషన్‌కు రాగా వారిని అప్పగించినట్లు సీఐ తెలిపారు.


రుణమాఫీ కాలేదని గాంధీభవన్ ఎదుట నిరసన

శాలిగౌరారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తనకు రుణమాఫీ కాలేదని, పంట బోనస్ రాలేదని నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం అంబారిపేట గ్రామానికి చెందిన తోట యాదగిరి హైదరాబాద్‌లోని గాంధీభవన్ మెట్ల మీద నిరసన వ్యక్తం చేశారు. తోట యాదగిరి, అతడి భార్య ప్రమీల శాలిగౌరారంలోని స్టేట్ బ్యాంకులో పంట రుణం తీసుకున్నారు. ఇద్దరి పేరు మీద రూ.3లక్షల వరకు రుణం బకాయి ఉంది. ప్రభుత్వం రూ2లక్షల వరకు రుణమాఫీ ప్రకటించినా యాదగిరికి అతడి భార్యకు రుణమాఫీ కాలేదు. యాదగిరి 53 క్వింటాళ్ల ధాన్యం మార్కెట్‌లో విక్రయించాడు. బోనస్ రాలేదు. ఇటు రుణమాఫీ కాక తీవ్ర ఆందోళనకు గురైన శుక్రవారం గాంధీభవన్ మెట్లు మీద నిరసన వ్యక్తం చేశాడు. మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకొని యాదగిరితో మాట్లాడారు. సచివాలయం వెళ్లి అక్కడ అధికారులను కలవాలని కొంతమంది చెప్పడంతో రైతు యాదగిరి సచివాలయం వెళ్లాడు. అక్కడ అతడి వినతిపత్రం తీసుకొని నల్లగొండ కలెక్టర్‌కు చెబుతామని పంపించినట్లు యాదగిరి తెలిపారు. యాదగిరికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి.


గాంధీభవన్ మెట్లపై కూర్చుని ఆందోళన చేస్తున్న యాదగిరి

హాల్ టికెట్‌లోనే అన్నీ

» ఇంటర్ హాల్ టికెట్స్‌లో సకల వివరాలు » క్యూఆర్ కోడ్, టోల్ ఫ్రీ, కంట్రోల్ రూం నెంబర్లు
» మార్చి 5 నుంచి 22 వరకు పరీక్షలు » ఉమ్మడి జిల్లాలో పరీక్షలు రాసేవారు సుమారు 40వేల మంది



భువనగిరి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే లక్ష్యంతో ఇంటర్ బోర్డు పలు సంస్కరణలను అమలు చేస్తోంది. నూతన విధానాలన్నీ త్వరలో జరిగే 2024-25 విద్యా సంవత్సరం పరీక్షల్లో అమలు కానున్నాయి. హాల్ టికెట్స్ నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకోండి అంటూ విద్యార్థుల సెల్ నెంబర్లకు మెసేజ్‌లు, పరీక్షా కేంద్రాల చిరునామా తెలుసుకునేలా క్యూఆర్ కోడ్, పరీక్షల నిర్వహణపై తలెత్తే సందేహాలను నివృత్తి చేసుకునేందుకు హాల్ టికెట్లపై జిల్లా కంట్రోల్ రూం నెంబర్ బోర్డు టోల్ ఫ్రీ నెంబర్ ఉండనున్నాయి. ఇంటర్ బోర్డు ప్రవేశపెడుతున్న నూతన విధానాలతో పరీక్షల ముందు విద్యార్థులకు మానసిక ఇబ్బందులు, హాల్ టికెట్ల టెన్షన్‌లు తప్పనున్నాయి. అలాగే ఇటీవల నిర్వహించిన ప్రాక్టికల్స్ పరీక్షలకు పలు కారణాలతో గైర్హాజరైన విద్యార్థులకు మరోమారు నిర్వహిస్తున్న ప్రాక్టికల్స్ పరీక్షలు 22తో ముగియనున్నాయి. కాగా మార్చి 5 నుంచి 22 వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సుమారు 40వేల మంది హాజరుకానున్నారు.

తప్పనున్న హాల్‌టికెట్ టెన్షన్

ప్రభుత్వ ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న ఫీజురీయింబర్స్ మెంట్‌ను సకాలంలో విడుదల చేయకపోతుండడంతో ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు పరీక్షల ముందు టెన్షన్ నెలకొంటోంది. ఫీజు చెల్లించని కారణంగా ప్రైవేట్ యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇచ్చేందుకు ససేమిరా అంటున్నాయి. దీంతో ఆర్థిక స్తోమత, పలుకుబడి కలిగిన విద్యార్థులు ఎంతో కొంత చెల్లించి హాల్ టికెట్స్‌ను తెచ్చుకుంటున్నారు. అయితే కొన్ని సంవత్సరాలుగా ఆన్‌లైన్‌లోనూ హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని ఇంటర్ బోర్డు కల్పించింది. కానీ ఆన్‌లైన్‌లో హాల్ టికెట్స్ ఎప్పటి నుంచి అందుబాటులో ఉంటాయి, డౌన్‌లోడ్ చేసుకునే విధానంలో కొంత అయోమయంగా ఉండేది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థుల్లో హాల్ టికెట్స్ అయోమయాన్ని తొలగించేందుకు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్స్ డౌన్‌లోడ్ అయ్యే తేదీ, విద్యార్థుల హాల్‌టికెట్ నెంబర్స్ వారి సెల్ నెంబర్లకు మెసేజ్ రూపంలో రానున్నాయి. అలాగే హాల్ టికెట్స్‌పై క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తున్నారు.ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి రూట్ మ్యాప్ ఆధారంగా సకాలంలో సులువుగా పరీక్షా కేంద్రాలకు వెళ్లే సదుపాయం విద్యార్థులకు లభించనుంది. అలాగే కొంతకాలంగా పరీక్షల ముందు విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. పరీక్షా కేంద్రాల నిర్వహణ తీరు, ప్రశ్నా పత్రాల లీకేజీ తదితర పుకార్లు షికారు చేస్తుండడంతో విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఫోన్‌లోనే ఉచిత కౌన్సిలింగ్‌కును ఇవ్వనున్నారు. అలాగే పరీక్షా కేంద్రాలు తదితర అంశాలపై స్పష్టతకోసం జిల్లావారీగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. టోల్ ఫ్రీ నెంబర్, జిల్లా కంట్రోల్ రూం నెంబర్లు హాల్‌టికెట్లపై ముద్రిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సుమారు 40వేల మంది విద్యార్థులు

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య, ప్రైవేట్ కళాశాలలకు చెందిన సుమారు 40వేల మంది జనరల్, ఒకేషనల్ కోర్సుల ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 7,840 మంది ప్రథమ సంవత్సరం, 8,349 మంది ద్వితీయ సంవత్సరం మొత్తం 16,189 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మార్చి 5 నుంచి 22 వరకు పరీక్షలు జరుగుతాయి. యాదాద్రి జిల్లా కంట్రోల్ రూం నెంబర్ 9866464361, ఇంటర్ బోర్డు టోల్ ఫ్రీ నెంబర్ 91 4024600110.

విద్యార్థులకు తీరనున్న ఇబ్బందులు



ఇంటర్ బోర్డు అమల్లోకి తెస్తున్న నూతన విధానాలతో విద్యార్థులకు పరీక్షల ముందు ఇబ్బందులు తీరనున్నాయి. యాజమాన్యంతో నిమిత్తం లేకుండానే ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయంతో పరీక్షల ముందు ఫీజు కష్టాలు తప్పనున్నాయి. క్యూఆర్ కోడ్ ముద్రణతో పరీక్షా కేంద్రం చిరునామా కనుక్కోవడంతో జరిగే ఆలస్యంతో పరీక్షను కోల్పోయే ప్రమాదం తప్పనుంది. కంట్రోల్ రూం నెంబర్, టోల్‌ఫ్రీ నెంబర్లతో విద్యార్థులకు మానసిక ఒత్తిడి తప్పుతుంది. సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. అవసరమయితే టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కౌన్సిలింగ్ పొందవచ్చు.

- డి.పాపిరెడ్డి, ప్రిన్సిపల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, భువనగిరి.

శాస్త్రోక్తంగా పంచ వింశతి కలశ స్నపనం

» నిత్యపూర్ణాహుతిలో పాల్గొన్న రామానుజ జీయర్
» మూడో రోజు మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. హోమాలు, జపాలు, పారాయణాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులను తిరువీధి సేవద్వారా యాగశాలకు చేర్చారు. అనంతరం చతుస్థానార్చన, విమాన దిగ్దేవతా విశేష హోమాలు, పంచ వింశతి కలశ స్నపనం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ జరిగాయి. మూలమంత్ర, మూర్తి మంత్ర హవనం, నిత్య పూర్ణాహుతి, నివేదన, నీరాజనం మంత్ర పుష్పం, శాత్తుమురై, తీర్థప్రసాదగోష్టి పాంచరాత్రాగమ రీతిలో కొనసాగాయి.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి అర్బన్)



యజ్ఞశాలలో పూజలు నిర్వహిస్తున్న రామానుజ జీయర్ , చిత్రంలో ప్రధాన అర్చకులు లక్ష్మీనర్సింహాచార్యులు

పంచ వింశతి (25) కలశంలలో పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చెరుకు రసం, కొబ్బరి నీళ్లు, ఎర్ర చందనం, కుంకుమ నీరు, మారపత్రి నీరు, కదళీ, శుద్ద జలం, సర్వ ఔషధ జలం, పుష్పోదకం, ఫలోదకం, గంధోదకం, హోమోదకం, రత్నోదకం, పుణ్యోదకం, సరిత్తోయం వంటి పవిత్ర జలాలు కలశంలో నింపి శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. మహాకుంభ సంప్రోక్షణలో భాగంగా పంచవింశతి కలశ స్నపన వేడుక నిర్వహించడం ఎంతో ప్రశస్థమైందని ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు వివరించారు.

వైకుంఠ నిజనివాస స్థానానికి : రామానుజ జీయర్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి చెంత జరుగుతున్న స్వర్ణ దివ్య విమాన రాజగోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవ పూజలు వైకుంఠ నిజనివాస స్థానానికి చేరుతాయని వానమామలై మఠం 31వ మధుర కవి పీఠాధిపతి రామానుజ జీయర్ ప్రవచించారు. యాదగిరికొండపై ఈ నెల 19 నుంచి జరుగుతున్న యాగశాలను జీయర్ శుక్రవారం సందర్శించి హవనాలు అందుకుంటున్న ఉత్సవమూర్తులను దర్శించుకుని తమిళభాషలో జీయర్ ఆజ్ఞతో ఆలయ ప్రధానార్చకుడు నల్లంథీగల్ లక్ష్మీనరసింహచార్యులు తెలుగులో అనువదిస్తూ ప్రవచించారు. జీయర్ సంకల్పంతోనే ఆలయం జీర్ణోద్ధారణ, బాలాలయం ఏర్పాటు, ఆలయ ప్రారంభానికి కుంభాభిషేకం కూడా మంగళ శాసనాలతోనే జరిగిందన్నారు. దివ్య విమాన రాజగోపురం ఆవిష్కరణకు ఈ నెల 23న దివ్య ముహూర్తం 11.54 గంటలకు ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభం అనంతరం దీన్ని భక్తి ప్రపంచానికి అంకితమివ్వనున్నట్లు చెప్పారు.

సాయంత్రం సహస్రనామ పారాయణాలు

నిత్య ఆరాధన అనంతరం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ, ద్వారాది కుంభార్చన, చతుస్థానార్చనలు, మూర్తి మంత్ర హోమాలు, ధాన్యాధివాసం, నిత్య పూర్ణాహుతి, నివేదన, తీర్థ ప్రసాదగోష్టి, తిరువీధి సేవతో ఉత్సవమూర్తులను ఆలయ ప్రవేశం చేశారు. ఉదయం, సాయంత్రం యాగశాలలో హోమాలు, జపాలు, పారాయణాలు వానమామలై మఠం 31వ మధుర కవి రామానుజ జీయర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో వైభవంగా కొనసాగాయి. ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు భట్టర్ సురేంద్రచార్యులు, కొడకండ్ల మాధవచార్యులు, అర్చక బృందం, రుత్వికులు, వేద పండితులు పాల్గొన్నారు. వేడుకల్లో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఆలయ ఈవో భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవో ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, దూశెట్టి కృష్ణ, గజ్వెల్లి రమేష్‌బాబు, రఘు, పర్యవేక్షకులు రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, ధీరావత్ రామరావునాయక్ పాల్గొన్నారు.

సంగీత సభలు

సంగీత సభల్లో భాగంగా సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు హర్షవర్ధన్ బండారీ భక్తి సంగీతం, 7 నుంచి 8 గంటల వరకు త్రైలోక ఆర్ట్స్ అసోసియేషన్ (ఇందిర పరాశరం) కూచిపూడి నృత్యం, 8 నుంచి 9 గంటల వరకు శాంకరి నాట్యస్థల్ (విజయవల్లి) కూచిపూడి నృత్యం భక్తులను అలరించాయి.

రుత్వికులకు వస్త్రాల అందజేత

మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాల్లో పారాయణాలు, హవనాలు, జపాలు పాల్గొన్న రుత్వికులకు హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంతరావు నూతన వస్త్రాలు అందజేశారు. యాగశాలలో శుక్రవారం దాత మెడలో వేసుకున్న విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, శేషు ఆకారంలోని బంగారాన్ని రుత్వికులు, అర్చకులు, భక్తులు ఆసక్తి తిలకించారు.

23న బ్రేక్ దర్శనాలు రద్దు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ సందర్శనకు తెలంగాణ ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 23న స్వామివారి స్వర్ణ దివ్య విమాన మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున ఆలయంలో జరిగే నిత్య కైంకర్యాల్లో స్వల్ప మార్పులు చేసినట్లు తెలిపారు. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనాలు, ఉదయం 10గంటల నుంచి ఉచిత, రూ. 150 టికెట్ దర్శనాలు, నిత్య కల్యాణోత్సవాలు, పుష్పార్చనలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా ఉదయం 9 గంటల నుంచి కొండపైకి ఎలాంటి ప్రైవేట్ వాహనాలు అనుమతి లేదని, స్వర్ణ తాపడం విరాళాలు ఇచ్చిన దాతల వాహనాలు కొండకింద పార్కింగ్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. హెలీప్యాడ్ వద్ద వాహన పూజలు రద్దు పర్చినట్లు తెలిపారు. 25 ఉచిత ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, కొండపైన బస్టాండ్ ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా పులిహోర ప్రసాదం అందజేయనున్నట్లు తెలిపారు. కొండపైన, కింద సంప్రోక్షణ ప్రత్యక్ష ప్రసారానికి గాను లైవ్ టెలికాస్ట్ ఎల్.ఈ.డీ స్క్రీన్ ద్వారా లైవ్ టెలికాస్ట్ చేయనున్నట్లు వివరించారు.

వైభవంగా సువర్ణ పుష్పార్చన

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో శుక్రవారం స్వామికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు రూ.14,84,440 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

రేపు యాదగిరిగుట్ట క్షేత్రానికి సీఎం


యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ప్రధానాలయంలో స్వామివారి బంగారు విమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఖరారైంది. ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న మహాకుంభాభిషేకానికి 11.54 గంటలకు ముహూర్తం నిర్ణయించారు. ఈ మేరకు సీఎం స్వర్ణ విమాన రాజగోపురం వద్దకు చేరుకునేందుకు కావాల్సిన మెట్లను రెండు వైపుల ఆలయ దక్షిణ తిరువీధిలో (ప్రాకారం లోపల) ఏర్పాటుచేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఈ నెల 19వ తేదీన దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంత రావు హెలీప్యాడ్ ప్రదేశాన్ని పరిశీలించగా, 20వ తేదీన డీసీపీ రాజేష్ చంద్ర యాదగిరిగుట్టపై భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు 400నుంచి 500మంది భద్రతా సిబ్బందిని నియమించి బందోబస్తు నిర్వహిస్తున్నారు. సుమారు 50.5 అడుగుల ఎత్తయిన పంచతల స్వర్ణ శోభిత రాజగోపురాన్ని సీఎం ప్రారంభిస్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎన్నికల కమిషన్ అనుమతితో సీఎం ఈ వేడుకల్లో పాల్గొననున్నారు. ఆకాశమార్గాన సీఎం యాదగిరిగుట్టకు చేరుకోనున్నారు. ఇందుకోసం క్షేత్ర ఉత్తర దిక్కులో హెలీప్యాడ్‌ను పరిశీలించి సిద్ధంచేశారు.

సీఎం పర్యటన ఇలా..

యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం ముందుగా ఘాట్ రోడ్డు వెంట దేవస్థానం అతిథిగృహం నుంచి లిఫ్ట్ ద్వారా యజ్ఞశాలకు చేరుకుంటారు. అక్కడ పూర్ణాహుతిలో పాల్గొని ఉత్తర రాజగోపురం నుంచి ఆలయంలో కి ప్రవేశించి పశ్చిమ తిరువీధి ద్వారా దక్షిణ తిరువీధి నుంచి చెక్కమెట్ల గుండా స్వర్ణ దివ్య విమాన రాజగోపురం వద్దకు చేరుకుంటారు. మహాకుంభాభిషేకం పూర్తికాగానే త్రితల రాజగోపురం ద్వారా ఆలయం ప్రవేశం చేస్తారు. ముందుగా క్షేత్రపాలకుడిని దర్శించుకుని ధ్వజస్థంభానికి మొక్కులు తీర్చుకుంటారు. అనంతరం స్వయంభువులను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేస్తారు. పశ్చిమ రాజగోపురం గుండా లిఫ్ట్ ద్వారా తిరిగి అతిథిగృహం చేరుకుంటారు. సీఎం పర్యటన సుమారు రెండు గంటలు సాగునుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

'భారతీయ పండుగల గొప్పదనం' పుస్తకావిష్కరణ

హైదరాబాద్‌లో పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మాజీ డీఎస్పీ, పుస్తక రచయిత నళిని

యాదగిరిగుట్ట రూరల్, ఫిబ్రవరి 21, (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి చెందిన మాజీ డీఎస్పీ, వేద ప్రచారకురాలు నళిని రచించిన 'భారతీయ పండుగల గొప్పదనం' పుస్తకాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆవిష్కరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో పుస్తకావిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ పండుగ విశిష్టతను భావితరాల వారికి అందజేసేలా ఈ పుస్తకం ఉందన్నారు. పుస్తక రచయిత నళిని మాట్లాడుతూ మహర్షి దయానంద సరస్వతి 201వ జయంతిని దయానంద దశమి పేరుతో ఈ నెల 23న జరుపుకుంటామని, ఆ మహర్షికి ఈ పుస్తకాన్ని అంకితం చేస్తూ అక్షర నివాళి అర్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య వసుధాశాస్త్రి, తెలంగాణ ఆర్య ప్రతినిధి సభ ఉపాధ్యక్షురాలు అరవింద శర్మ, పురోహితులు రాజేశ్వర్ ఆర్య, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్, వంగరీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూసీ కుడి, ఎడమ కాల్వలకు సాగునీటి విడుదల



కుడి కాల్వలో ప్రవహిస్తున్న నీరు

కేతేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు మూడో విడత సాగు నీటిని అధికారులు శుక్రవారం విడుదల చేశారు. మూసీ ఆయకట్టుకు సాగునీటి విడుదల నిర్ణీత షెడ్యూలు మేరకు ఈ నెల 23నుంచి మూడో విడత నీటిని వదలాల్సి ఉంది. ఎండల తీవ్రత పెరగడంతో ఆయకట్టులో సాగు చేసిన పంటలు ఎండే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఆయకట్టు రైతులు మూడో విడత సాగునీటిని విడుదల చేయాలని మూసీ అధికారులకు విజ్ఞప్తులు చేశారు. రైతుల విజ్ఞప్తుల మేరకు రెండు రోజుల ముందే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. ఈ మేరకు శుక్రవారం కుడి కాల్వకు 249క్యూసెక్కులు ఎడమ కాల్వకు 166క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు. ఈ విడతలో రెండు కాల్వలకు 15రోజుల పాటు (మార్చి7వరకు) నీటి విడుదల కొనసాగనుంది. కాగా 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్ నీటిమట్టం ప్రస్తుతం 636.40అడుగులు(2.45టీఎంసీలు)గా ఉంది.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ దాడులు

● 15 లీటర్ల నాటుసారా, 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పీఏపల్లి మండలంలోని చిలకమర్రి, పలుగుతండా, చింతల్‌తండా గ్రామాల్లో సారా బట్టీలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం విస్తృతంగా దాడులు జరిపారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పాల్గొని 15లీటర్ల నాటుసారా, 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి ఉపయోగించే పెద్దపెద్ద డ్రమ్ములు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని సారా బట్టీలను నిర్వహిస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేశారు. సంపూర్ణ సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి గ్రామస్థులు సహకరించాలని సీఐ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా సారా తయారీ అమ్మకం, సరఫరా చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లేష్, కానిస్టేబుల్స్ నాగరాజు, శేఖర్‌రెడ్డి, హరీష్ పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాలకు మళ్లీ ఇన్‌చార్జీలు



భూదాన్‌పోచంపల్లిలోని చేనేత సహకార సంఘం విక్రయశాల

(5వపేజీ తరువాయి)

చేనేత సహకార, పవర్‌లూమ్‌లు కలిపి మొత్తం 84 వరకు ఉన్నాయి. అందులో 25,900 మంది కార్మికులు ఉన్నారు. యాదాద్రి జిల్లాలో మొత్తం 44 చేనేత సంఘాలు ఉండగా ఏడు పవర్‌లూం సంఘాలు ఉన్నాయి. అందులో మొత్తం 18,852 మంది కార్మికులు ఉన్నారు. మగ్గం నేసే కార్మికులు 6,294 మంది ఉండగా, చేనేత అనుబంధ రంగంలో పనిచేస్తున్నవారు మరో 12,600 మంది వరకు ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 25 చేనేత సహకార సంఘాలు, ఐదు పవర్‌లూం సంఘాలు ఉన్నాయి. అందులో సుమారు 6,580 మంది కార్మికులు ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం మూడు చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. అందులో 320 మంది కార్మికులు పనిచేస్తున్నారు. మగ్గం నేసే కార్మికులు 110 మంది ఉండగా, అనుబంధ రంగంలో పనిచేసే కార్మికులు 210 మంది ఉన్నారు. సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారందరికీ ప్రభుత్వం పాస్‌బుక్‌లు ఇచ్చి వాటి ఆధారంగా ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను సైతం రూపొందించింది. ఆ తరువాత ఎన్నికలు నిర్వహించకుండా ఇన్‌చార్జీల పాలనను మరో ఆరు నెలలు పొడిగించింది.

ఇన్‌చార్జీల పాలనలో ఇష్టారాజ్యం

చేనేత సంఘాలకు 12 ఏళ్లుగా ఎన్నికలు లేవు. గతంలో ఆప్కో ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతీ మూడు నెలలకోసారి కొనుగోళ్లు జరిగేవి. కేవలం సహకార సంఘాల్లోనే ప్రొక్యూర్‌మెంట్ ఇచ్చేవారు. దీంతో చేనేత సంఘాలు ఆర్డర్‌పై కార్మికుల చేత వస్త్రాలు నేయించేవారు. క్యాష్ క్రెడిట్‌పై సంఘాలు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని కార్మికులకు పని కల్పిస్తూ వస్త్ర ఉత్పత్తులను ఆప్కోకు విక్రయించేది. వారు ప్రతీ ఆరు నెలలకోసారి కొనుగోలు చేసిన వస్త్రాలకు డబ్బు చెల్లించేవారు. తదుపరి ఆర్డర్ ఇచ్చి మళ్లీ ప్రొక్యూర్‌మెంట్ కల్పించేది. దీంతో సహకార సంఘాలు కార్మికులకు చేతినిండా పనికల్పిస్తూ ఉండేవి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లక్రితం టెస్కోను ఏర్పాటు చేసింది. ఎన్నికల నినాదంగా నామమాత్రంగా ప్రొక్యూర్‌మెంట్ ఇచ్చి సంఘాలకు ఆర్డర్ ఇచ్చినట్లు వ్యవహరించేది. దీంతో చేనేత సంఘాలన్నీ పనికల్పించలేని స్థితికి చేరుకున్నాయి. కొన్ని సంఘాల్లో వందలాది చీరలు మాయమయ్యాయి. చేనేత సంఘాల్లో పేరుకుపోయిన వస్త్రాలను కొనుగోలు చేయడంలో టెస్కో విఫలమైంది. కాగా, సంఘాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై సహకార సంఘం 51వ నిబంధన విచారణను నిర్వహించింది. విచారణ తీవ్ర జాప్యం జరుగుతుండడంతో మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక సమయంలో ఈ విచారణను రద్దు చేసింది. అయితే పర్సన్ ఇన్‌చార్జీలను నియమించడంతో చేనేత సహకార సంఘాలు అచేతనంగా మిగిలాయి. కార్మికులకు చేతినిండా పనికల్పించలేకపోతున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని కార్మికులు వాపోతున్నారు. ముఖ్యంగా నూలు, రంగులు, రసాయనాలు తదితర ముడి సరుకు సకాలంలో అందించలేకపోతున్నారు. దీంతో చేనేత కార్మికులు మాస్టర్ వీవర్స్ వద్ద కూలీగా మగ్గాలపై పనిచేస్తున్నారు. చేనేత సంఘాల్లో వస్త్రాల విక్రయాలు సైతం గణనీయంగా తగ్గాయి. ఒక్కో సంఘంలో కోటి రూపాయల విలువైన చేనేత వస్త్రాలు నిల్వ ఉన్నాయి. అరకొరగా వస్త్రాలు కొనుగోలు చేసిన టెస్కో సైతం పేమెంట్లు చెల్లించడంలో జాప్యం చేస్తుండడంతో సంఘాలు కార్మికులకు పని కల్పించలేని స్థితిలో ఉన్నాయి. ఎన్నికలు నిర్వహిస్తేనే సమస్యలకు చెక్ పడుతుందని చేనేత వర్గాలు భావిస్తున్నాయి.


పాలకవర్గాలతోనే ఆర్థిక పరిపుష్టి

చేనేత సహకార సంఘాలకు పాలకవర్గాలు ఉంటేనే చేనేత కార్మికులకు ప్రయోజనం ఉంటుంది. వారు తీసుకునే నిర్ణయాలతో సంఘాలు ఆర్థికంగా బలోపేతమవుతాయి. తద్వారా కార్మికులకు చేతినిండా పనికల్పించే వీలుంటుంది. నూలు, రంగులు, రసాయనాలను కార్మికులకు సబ్సిడీపై అందించవచ్చు. ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు, రుణాలు అందించడంతోపాటు సహకార సంఘాలు కూడా కార్మికులకు వ్యక్తిగతంగా రుణాలు అందించే అవకాశాలు ఉంటాయి.

'చేనేత సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జీలను రద్దు చేయాలి'

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా గత ప్రభుత్వం కాలయాపన చేసిందని, ఈ ప్రభుత్వమైనా సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, పర్సన్ ఇన్‌చార్జీలను రద్దు చేయాలని కోరుతూ చేనేత కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును గురువారం కలిసి విన్నవించారు. రాష్ట్ర చేనేత నాయకులు చెరుపల్లి సీతారాములు, కూరపాటి రమేష్ తదితరులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పర్సన్ ఇన్‌చార్జీల పాలనలో చేనేత సహకార సంఘాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని అన్నారు. కాగా, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమస్యలు విని సానుకూలంగా స్పందించారని, త్వరలోనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి



చేనేత కార్మికులకు చేనేత సంఘాలు కన్నతల్లి లాంటివి. గత ప్రభుత్వం దీర్ఘకాలంగా ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేసింది. ఈ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించాలి. అధికారుల పాలనలో చేనేత సంఘాలు కుదేలవుతున్నాయి. పర్సన్ ఇన్‌చార్జిలను తొలగించి వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

-గంజి కృష్ణ, చేనేత నాయకులు, భూదాన్‌పోచంపల్లి

జూలై 20 వరకు గడువు పెంపు



చేనేత సహకార సంఘాలకు నియమించిన పర్సన్ ఇన్‌చార్జీల గడువు మరో ఆరు నెలలు పొడగిస్తూ ప్రభుత్వం ఈనెల 15న ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని చేనేత సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జీల పదవీ కాలం జనవరి 21కి ముగిసింది. దీంతో వీరి పదవీ కాలం జూలై 20వ తేదీ వరకు గడువు పెంచింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మగ్గం నేసే చేనేత కార్మికులకు అందేలా కృషి చేస్తున్నాం.

-పద్మ, చేనేత, జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్

బిక్కేరులో నీరు పారించిన ఘనత సీఎందే

● తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు



బిక్కేరు వాగులో గోదావరి జలాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): యాసంగి వరి పంట ఎండిపోకుండా కాపాడేందుకు ఎడారిగా మారిన బిక్కేరు వాగులో గోదావరి జలాలు పారించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిదేనని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం సదర్శాపురం చెక్‌డ్యామ్ వద్ద బిక్కేరు వాగులో ప్రవహిస్తున్న గోదావరి జలాలకు పాలు పోసి, పూలు, పసుపు, కుంకుమ చల్లి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం బిక్కేరు వాగు పొంగిపొర్లకపోవడంతో రైతుల పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడటంతో ఈ ప్రాంత బిడ్డగా, రైతుల బాధలు తెలిసిన వాడిగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి వానాకాలంలో, యాసంగిలో వాగులోకి గంధమల్ల రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలు విడుదల చేయించినట్లు తెలిపారు. అడ్డగూడూరు మండలం ధర్మారం చెక్‌డ్యామ్ వరకు నీళ్లు వెళ్లేవరకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్.బాలరాజు, అడ్డగూడూరు మండల అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, మార్కెట్ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చేడె చంద్రయ్య, కాంగ్రెస్ సదర్శాపురం గ్రామ శాఖ అధ్యక్షుడు పల్లెర్ల భాస్కర్ పాల్గొన్నారు. సదర్శాపురంలో సామేలుకు నిరసన సెగ తగిలింది. ఫ్లెక్సీలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేలు ఫొటోలు మాత్రమే పెట్టారు. ఫ్లెక్సీలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు లేవు. దీంతో కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమను కార్యక్రమానికి ఎందుకు పిలవడంలేదని ప్రశ్నించిన వారిని 'మీరు వస్తే నేను వద్దన్నానా అని ఎమ్మెల్యే వారిని ఎదరు ప్రశ్నించారు.

జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలపై నేడు నిరసనలు

నల్లగొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిపై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి చేసిన అనుచిత వాఖ్యలను నిరసిస్తూ నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో నిరసన చేపట్టనున్నట్లు ఆపార్టీ పార్లమెంట్ నియోజకవర్గ అడహక్ కమిటీ కన్వీనర్ కసి రెడ్డి శేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దిష్టిబొమ్మ దహనాలతో పాటు ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

సీతారామాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు

కనగల్, ఫిబ్రవరి 21: (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్లచెన్నారం గ్రామంలో గల సీతారామాంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. శనివారం యాగశాల ప్రవేశం, హోమపూజలు, పూర్ణాహుతి, శ్రీ విష్ణునామ స్తోత్ర పారయాణం, ఎదుర్కోళ్లు ఆదివారం స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవకమిటీ సభ్యులు మాజీ సర్పంచులు తెలిపారు.

ఒలింపియాడ్‌లో డీపాల్ విద్యార్థుల ప్రతిభ


ఎడ్రియా థెరిసా


లియోనా జూడి

కేతేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ (ఐబీవో) 2024-25లో మండల కేంద్రం కేతేపల్లిలోని డిపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. గత ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన పరీక్షకు 42మంది విద్యార్థులు హాజరయ్యారని, వీరిలో ముగ్గురు జిల్లా స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ సాజీ తెలిపారు. మిగిలిన వారు మెరిట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆ తర్వాత ఈ నెల 9న ఖమ్మం జిల్లాలోని ఎస్‌బీఐటీ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పరీక్షల్లో 8వ తరగతి విద్యార్థులు మేడికొండ ఎడ్రియా థెరిసా, నంద్యాల లోకేశ్వర్‌రెడ్డి, 6వ తరగతి విద్యార్థులు మేడికొండ లియోనా జూడిలు ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయరాజు, జయరాజు తదితరులు శుక్రవారం అభినందించారు.

హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయిన విద్యార్థులతో బోధన సిబ్బంది

మర్రిగూడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మర్రిగూడ మండల కేంద్రానికి సెయింట్ మేరీ పాఠశాల విద్యార్థులు హ్యాండ్ బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ రహమత్ తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి హాండ్‌బాల్ అండర్ -14 బాలబాలికల క్రీడ పోటీలను శుక్రవారం సెయింట్ మేరీ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఝాన్సీ ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు మహారాష్ట్రలోని నాగాపూర్‌లో మార్చి 21వ తేదీ నుంచి 27వరకు జరిగే జాతీయ స్థాయి పోటోల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్ బాల్ కోచ్ మేడిపల్లి పవన్, నవీన్, గణేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నలగాటి ప్రసన్నరాజ్

కట్టంగూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ అన్నారు. ఫ్లయింగ్ ఈగల్ యూత్ ఆధ్వర్యంలో మండలంలోని పందెనపల్లి గ్రామంలో నిర్వహించిన జిల్లా సాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు శుక్రవారం ఆయన జ్ఞాపకతో పాటు పాటు నగదును అందజేసి మాట్లాడారు. ప్రథమ స్థానం సాధించిన కట్టంగూరు జట్టుకు జ్ఞాపిక, రూ.30వేలు, ద్వితీయ బహుమతి సాధించిన పందెనపల్లి జట్టుకు జ్ఞాపిక, రూ.15 వేలు, తృతీయ స్థానం సాధించిన ఈదులూరు జట్టుకు జ్ఞాపిక రూ.7,500లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు ఉట్కూరి ఏడుకొండలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, నాయకులు యాదయ్య, గుండాల మహేష్, మేకల రమేష్, చిట్యాల రాజిరెడ్డి, నర్సింహ, సుధాకర్, నాగరాజు, మహేష్, సోమయ్య, సునీల్, బుక్కమ్మ, బాలసైదులు పాల్గొన్నారు.

భిక్షమయ్యగౌడ్ మృతి సీపీఎంకు తీరని లోటు

చండూరు రూరల్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు, గీత కార్మిక సంఘం నేత జెర్రిపోతుల భిక్షమయ్యగౌడ్ మృతి సీపీఎంకు తీరని లోటని ఆపార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన భిక్షమయ్యగౌడ్ గురువారం అనారోగ్యం మృతి చెందారు. ఆయన మృతదేహంపై సుధాకర్‌రెడ్డి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. భిక్షమయ్య కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బండ శ్రీశైలం, చిన్నపాక లక్ష్మీనారాయణ, పాలడుగు నాగార్జున, నాంపల్లి చంద్రమౌళి, మల్లం మహేష్, సీఐటీయూ నాయకులు లింగయ్య, వెంకటేశ్వర్లు, పగిళ్ల భిక్షం, లింగస్వామి, సైదులు, హమాలి సంఘం నాయకులు నాగరాజు, యాదయ్య తదితరులు ఉన్నారు.

ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠకు విరాళం


విరాళం అందజేస్తున్న కొండ జానయ్యగౌడ్

నకిరేకల్, ఫిబ్రవరి 21, (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మునిసిపాలిటీ పరిధిలోని 7వ వార్డు బాబాసాహెబ్‌గూడెంలో నూతనంగా ప్రతిష్ఠించే ముత్యాలమ్మ విగ్రహం కోసం నకిరేకల్ కల్లుగీత పారిశ్రామిక సహకారసంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్ రూ.35వేలు అందజేశారు. ఈ. కార్యక్రమంలో భూపతి వెంకటనారాయణ, కల్లుజో శ్రీనివాస్, భూపతి శ్రీనివాస్, వరికుప్పల రాములు, మట్టిపల్లి కృష్ణయ్య, భూపతి వీరయ్య, మట్టిపల్లి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆవుకు పుట్టినరోజు వేడుక


నార్కట్‌పల్లిలో ఆవు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న కాలనీవాసులు

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 13వ వార్డుకు చెందిన సతీశ్ ఆవుకు శుక్రవారం రాత్రి పుట్టినరోజు వేడుకలు నిర్వహించాడు. నాలుగేళ్ల క్రితం ఇదే రోజున ఆవు జన్మించగా ప్రతీ పర్యాయం గోమాత పూజల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్నాడు. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి కాలనీలోని తన నివాసం వద్ద కాలనీ వాసులు, పలువురు రాజకీయ నేతల సమక్షంలో ఆవుకు పూజ చేసి కేక్ కట్ చేశారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి


చిట్యాల మండలం చిన్నకాపర్తి జడ్పీహెచ్‌ఎస్‌లో వివిధ వేషధారణలో విద్యార్థులు

కేతేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమారం జడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కాళోజీ నారాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.భిక్షమయ్య మాట్లాడుతూ అమ్మలాంటి కమ్మనైన మాతృభాషను మరవొద్దన్నారు. ప్రపంచంలోని ఏ భాషనైనా తనలో ఇముడ్చుకోగల శక్తి తెలుగు భాషకు మాత్రమే ఉందన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని కవులు తమ కవితలు, రచనల ద్వారా నేటి తరానికి చాటి చెప్పాలన్నారు. విద్యార్థులు మాతృభాషపై మక్కువను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.పరమేష్, బి.జానకిరెడ్డి, జి.రమేష్, కన్నె శివయ్య, ఎల్.శ్రీధర్, డి.నాగయ్య పాల్గొన్నారు.


కేతేపల్లి: భీమారంలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

● చిట్యాలరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకాపర్తి జడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం అంతజార్జాతీయ మాతృభాషాదినోత్సవం ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పోతురాజు, పిట్టలదొర, గౌడుబటులతో పాటు పలు వేషధారణల్లో విద్యార్థులు ప్రదర్శనలు, నృత్యాలు చేశారు. పుస్తక ప్రదర్శన పొడుపుకథలు సామెతలతో పాటు పలు ఆటలను ఆడించారు. విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు గీత మాట్లాడుతూ మాతృభాషను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని ఎక్కడ ఉన్నా మాతృభాషపై ఉన్న మమకారాన్ని మరువొద్దన్నారు. విద్యార్థుల ప్రదర్శనలను వీక్షించిన ఉపాధ్యాయులు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలయ్య, నైముద్దీన్, సాయిబాబా, మాధవి, నవ్య, సుశ్విత, శ్రీలత, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచారం

27న జాతీయసైన్స్ దినోత్సవ పోటీలు

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు ఈనెల 27న సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో వివిధ అంశాలపై జాతీయ సైన్స్ దినోత్సవ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో జిల్లాలోని 9 నుంచి 12 తరగతులు చదువుతున్న అన్ని యాజమాన్యాలు విద్యా ర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 23 సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని కోరా రు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి ఫోన్ నెంబర్ 9848578845 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పశుసంవర్ధక శాఖ జేడీగా రమేష్

నల్లగొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి జేడీగా ఖాద్రీ బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రమేష్ నాగర్‌కర్నూల్ నుంచి పదోన్నతిపై బదిలీపై జిల్లాకు వచ్చారు.

ఆదిపరాశక్తి అవతారంలో ఎల్లమ్మ


ఆదిపరాశక్తి అలంకరణలో అమ్మవారు

కనగల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ తల్లి మాఘమాసం శుక్రవారం బహుళ అష్టమి, నవమి పురస్కరించుకుని భక్తులకు ఆదిపరాశక్తిగా దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అలాగే రేవంత్‌రెడ్డి అభిమాన సంఘం రాష్ట్ర నాయకుడు తరి నాగయ్య ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. నాగయ్యకు అర్చకులు వేద ఆశీర్వచనాలను తీర్థప్రసాదాలను అందజేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నర్సిరెడ్డిని గెలిపించాలి

● టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని అత్యధిక మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కోరారు. నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటర్ గెలిచినట్లని, ఇంకెవరు గెలిచినా వారు వెంటనే అధికార పార్టీలో చేరిపోయే అవకాశవాదులేనని, అప్పుడు ఓటర్ ఓడిపోతారని అన్నారు. శుక్రవారం జిల్లాలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. అనంతరం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నర్సిరెడ్డి మాత్రమే ఆరేళ్లు నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నిత్యం నియోజ కవర్గంలో పర్యటిస్తూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరి ష్కారానికి కృషి చేశారన్నారు. ఆయన చొరవతోనే టెట్ వివాదం పరిష్కార మైందని, వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వచ్చాయని అన్నారు. నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తామన్న హామీ మోడల్ స్కూల్స్, గురుకులాలు, కేజీబీవీల్లో అమలు జరగడం లేదన్నారు. విశ్రాంత ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్ తదితర రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంవత్సర కాలంగా విడుదల కాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్లవెంకటేశం, జిల్లా కార్యదర్శి గేర నరసింహ, నలపరాజు వెంకన్న, తెలంగాణ పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి నర్రా సరళ, మండల బాధ్యులు రమణ పాల్గొన్నారు.

● గట్టుప్పల్ : విద్యారంగ సమస్యలను పరిష్కరించే ప్రజా నాయకుడు అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని ప్రజా ఉద్యమ వేదిక జిల్లా కన్వీనర్ బండ శ్రీశైలం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఉపాధ్యాయులను కలిసి అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా ఉద్యమ వేదిక రాష్ట్ర నాయకులు కట్ట నరసింహ, మండల కన్వీనర్ కర్నాటి సుధాకర్, ప్రజా ఉద్యమ వేదిక నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఉర్సు


ఉర్సులో పాల్గొన్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు

మునుగోడు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలకు అతీతంగా అందరూ కలిసి నిర్వహించుకునే ఏకైక పండుగ హజరత్ సయ్యద్ దర్గా జాతర అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండలం లోని ఇప్పర్తి కేతులారం గ్రామాల మధ్యన వెలసిన హజరత్ సయ్యద్ షరీఫ్ జాతరను ప్రతి ఏడాది ముస్లింలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉత్సవాలకు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ హజరత్ సయ్యద్ దర్గాను ప్రతి సంవత్సరం భక్తులు వేలాదిమంది పాల్గొనడం జాతర ప్రత్యేకత అన్నారు. ఈ దర్గాకు రోడ్డు సౌకర్యం, తాగునీరు, భక్తులకు మూత్రశాలలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు బొడిగె అశోక్, పూల వెంకటేశం, జాజుల వెంకటేశం, నల్ల నాగిరెడ్డి, గురుజ నర్సింహగౌడ్, జాజుల రవీందర్, కందుల ప్రభాకర్, మేకల గోపాల్, జాజుల నరసింహ, అనంతల సాయి గౌడ్, కందుల అనిల్ కుమార్, బత్తుల రవికుమార్, ఈసం బాబు పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లి ప్రజలను దీవించాలి


ముత్యాలమ్మకు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, ఫిబ్రవరి 21,(ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మతల్లి ప్రజలను దీవించాలని నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం అన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులోని బాబాసాహెబ్‌గూడెంలో నూతనంగా ప్రతిష్ఠించిన ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వ హించారు. బాబాసాహెబ్‌గూడెంలోని ప్రజలందరిని ముత్యాలమ్మతల్లి కాపాడుతుందని ప్రతి ఒక్కరూ దైవభక్తి మీద ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితాశ్రీనివాస్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బచ్చుపల్లి గంగాధర్‌రావు, కౌన్సిలర్లు గాజుల సుకన్య, కందాళ భిక్షంరెడ్డి, యాసారపు లక్ష్మీవెంకన్న పాల్గొన్నారు.

భీమారం చర్చి వేడుకలకు ఆహ్వానం

కేతేపల్లి : మండలంలోని భీమారం గ్రామంలో ఈ నెల 25న నిర్వహించే ఏసు తిరుహృదయ చర్చి వార్షికోత్సవ వేడుకలకు హాజరుకావాలని ఎమ్మెల్యే వేముల వీరేశంను చర్చి కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం చర్చి ఫాదర్ జోసఫ్, చర్చి కమిటీ సభ్యులు నకిరేకల్‌లోని ఎమ్మెల్యే నివాస గృహానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందించారు. ఎమ్మెల్యేను ఆహ్వానించిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, స్థానిక కాంగ్రెస్ నాయకుడు బి.నరేందర్‌యాదవ్, చర్చి కమిటీ సభ్యులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


నాంపల్లిలో మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి

నాంపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సబ్సిడీ యూరియాను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు రుణాలను అందజేస్తున్నట్లు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, అన్నపాక హరీష్ అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బియ్యం పంపిణీ


బియ్యం అందజేస్తున్న కోట పూర్ణచందర్‌రావు తదితరులు

కేతేపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిగూడెం గ్రామానికి చెందిన వడ్డె జానయ్య, వడ్డె అచ్చమ్మ అకాల మరణం చెందారు. పేదరికంలో ఉన్న ఆయా మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన స్థానిక కాంగ్రెస్ నాయకుడు కోట పూర్ణచందర్‌రావు ఒక్కో కుటుంబానికి 50కిలోల బియ్యం అందజేఆరు. కార్యక్రమంలోవెంబడి కనకయ్య, అఖిల్, బుద్దె వెం కన్న, అంకతి నరేష్, వడ్డె సైదులు, మహేష్, ఎం.పరశురాములు, వడ్డె ప్రభాకర్, కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల బహూకరణ

శాలిగౌరారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం జడ్పీ హైస్కూల్‌కు 2003-04, బ్యాచ్ పూర్వ విద్యార్థులు వసుకుల శ్రవణ్ సొంత నిధులతో రూ. 10వేల విలువైన కుర్చీలను హెచ్‌ఎం కోట మల్లయ్యకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు తాటిపాముల శంకర్, బోడ రాజు, తాటిపాముల జయరాజు, గరిగంటి శంకర్, కర్నాటి గిరి, వాడపల్లి మల్లేష్, ఆకుల రవి, గుండ్ల సైదులు, మొలుగూరి అశోక్ పాల్గొన్నారు.


కుర్చీలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

లచ్చిరాం నాయక్ డాక్టరేట్

మర్రిగూడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం నాయక్ ఢిల్లీకి చెందిన ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. ఈనెల 28న హైదరాబాద్‌లోని సిటీ కల్చర్ ఆడిటోరియం వేదికలో డాక్టరేట్‌ను అందుకోబోతున్నట్లు శుక్రవారం తెలిపారు. విద్యాసామాజిక సేవ, యూత్ డెవలప్‌మెంట్ విభాగంలో డాక్టరేట్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

తిప్పర్తి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జొన్నగడ్డలగూడెం గ్రామంలో శుక్రవారం గుండెపోటుతో ఓ ఉపాధ్యాయుడు చెందాడు. గ్రామానికి చెందిన నర్సింగ్ ప్రభాకర్(38) ఉపాధ్యాయుడు అదే మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లి గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా తనకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో సెలవు తీసుకొని ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఉదయం 9 గంటల సమయంలో ఒక్కసారిగా ఛాతీవద్ద నొప్పి రావడంతో తన సోదరుడి సాయంతో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నల్లగొండ సమీపంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.110	170	190
సూర్యాపేట	రూ.125	170	200
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 32.0 । కనిష్ఠం 19.8



- జీవం కోల్పోయిన సీజన్ పూత
- ఈ ఏడాది దిగుబడులపై తీవ్ర ప్రభావం
- పెట్టుబడులు వచ్చేది కష్టమే


బత్తాయికి.. తామర ముప్పు

దశాబ్దకాలంగా వాతావరణంలో మార్పులు ఏర్పడుతున్నాయి. విత్తనం నాటిన నాటి నుంచి పంట కోతకు వచ్చే వరకు పురుగుల ఉధృతి అధికమైంది. ప్రతీ పంట సాగులోనూ ఎన్నో ఒడిదొడుకులు ఎదురవుతున్నాయి. ఉష్ణప్రాంత పంట అయిన బత్తాయి ప్రతికూల పరిస్థితులను కొంత మేర కు తట్టుకుంటుంది. అటువంటి బత్తాయి పంటకు కొత్త ముప్పు వచ్చి పడింది. ఇప్పటి వరకు మంగునల్లి, వేరుకుళ్లు వంటి ప్రమాదకరమైన తెగుళ్లను ఎదుర్కొంటున్న బత్తాయికి నల్ల తామర పురుగు ఆశించి తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. దీంతో రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ(వ్యవసాయం)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో బత్తాయి సాగవుతోంది. బత్తాయిలో ప్రధానంగా సీజన్ కాయ 80శాతం మేర దిగుబడి వస్తుంది. సాధారణంగా నవంబరులో వాడుకు వదిలి (బహెర్ పద్ధతి) డిసెంబరు నెలలో నీటి తడులు ఇవ్వడం ద్వారా జనవరి, ఫిబ్రవరిలో పూత దశకు వస్తుంది. ప్రస్తుతం బత్తాయి పూత దశ నుంచి మొగ్గకు చేరే దశలో ఉంది. ఈ సమయంలో నల్ల తామర పురుగు ఆశించి పూత జీవం కోల్పోయిందని రైతులు చెబుతున్నారు. బత్తాయిలో పూత 70-80 శాతం వరకు నుసిగా మారిపోయింది. ఎన్ని పురుగు మందులు పిచికారీ చేసినా పూతను కాపాడుకోలేక పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుంది. సాధారణంగా ఎకరానికి 6-8టన్నుల దిగుబడి వరకు వస్తుంది. ప్రస్తుతం రెండు టన్నులు కూడా రావని రైతులు వాపోతున్నారు. నాలుగేళ్లుగా కొంత మేర తామర పురుగు వ్యాప్తి ఉన్నా 20శాతం మేర మాత్రమే నష్టం వాటిల్లింది. ఏటా ఉధృతి పెరుగుతూ ఈ ఏడాది పూర్తిస్థాయిలో పంటకు వ్యాప్తించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. బత్తాయికి ఎకరానికి సుమారు రూ.50వేలకు పైబడి పెట్టుబడి అవుతుంది. ప్రస్తుతం బత్తాయిలో కత్తెరతోపాటు సీజన్ కాయలేకపోవడంతో కనీసం పెట్టుబడిలో పది శాతం మేర ఆదాయం వచ్చే పరిస్థితి లేదు.

సీజన్ పూత దెబ్బతిన్నది



బత్తాయి 10 ఎకరాల్లో సాగు చేస్తున్నా. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. వంద శాతం సీజన్ పూత వచ్చినా సుమారు 80శాతం పూత పిందె ఏర్పడే దశలో ఎండిపోయింది. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఎటువంటి మార్పులు రాలేదు. ఏటా సుమారు 80-100 టన్నుల వరకు సీజన్ బత్తాయి దిగుబడులు వచ్చేవి. ఈ ఏడాది పూర్తిస్థాయిలో పూత దెబ్బతినడంతో కనీసం 20 టన్నుల దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. - కరణం మల్లిఖార్జున్, రైతు, హాలియా

తామర పురుగుల ఉధృతితో పంటలకు నష్టం..

దండు ఆదర్శ్, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, గడ్డిపల్లి

తామర పురుగులు నాలుగేళ్లుగా మిరప పంటకు వ్యాపించి తీవ్ర నష్టాన్ని కలగజేస్తున్నాయి. ఈ ఏడాది మాత్రం బత్తాయిలో ఉధృతి అధికమైంది. పూతను ఆశించి నష్టాన్ని కలిగిస్తున్నారు. ఈ పురుగు కంటికి కనపడనంత చిన్నగా, నల్లగా అర సెంటీమీటర్ పరిమాణంలో ఉంటుంది. పురుగు గుడ్డు దశ నుంచి లార్వా దశకు చేరే సమయంలో ఆకులు, పూతలు, కాయలను ఆశించి రంపం వంటి నోటితో గీకి పత్రహరితాన్ని పీల్చేస్తుంది. ఇది ఆశించిన ఏ పంట అయినా పూర్తిస్థాయిలో దెబ్బతింటుంది. ఈ పురుగు దశ 20-25 రోజుల వరకు ఉంటుంది. పంటను ఆశించిన తరువాత భూమిలోకి చేరి కోశస్థ దశకు చేరుతుంది. 3-5 రోజుల తరువాత నిద్రావస్థ పూర్తి చేసుకుని పురుగు సంపర్కం చేసుకుని గుడ్లు పెడుతుంది. పిల్లపురుగులతో కలిసి తల్లి పురుగు పది రోజుల వ్యవధిలో పంటను మొత్తం ఆశించి నష్టం చేస్తుంది. ఉబ్బ, అధిక వేడి వాతావరణం ఈ పురుగు ఉధృతి పెరగడానికి కారణాలు.

నివారణ

- ప్రాథమిక దశలో ఈ పురుగు ఉధృతిని అరికట్టేందుకు వేప నూనె 10వేల పీపీఎం 2ఎంఎల్, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఫిప్రోనిల్ 2ఎంఎల్, స్పైనోషాడ్ 0.3ఎంఎల్, లీటర్ నీటికి, ఇమిడాఇప్రోనిల్ 0.3ఎంఎల్, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పురుగు ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఎక్స్‌పోనస్‌గ్రేసియా ఎకరానికి 34ఎంఎల్, స్పైరాటెట్రామిల్ 1గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- జంప్ ఎకరానికి 40గ్రా. గుళికలు, (పిచికారీకి, నేలలో వేయడానికి ఉపయోగపడుతుంది)
- టెట్రామిల్ 1ఎంఎల్ లీటర్ నీటికి కలిపి, అదనంగా పంటకు 13-0-45, 19-19-19 మందులు 5-10 గ్రాముల వరకు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- గుళికలు చెట్టు వయసును అనుసరించి సరైన పరిమాణాన్ని అడుగు భాగంలో వేయాలి.
- పురుగు ఉధృతిని అనుసరించి ఆర్గానిక్ మందులు పిచికారీ చేయాలి. బవేరియా 5ఎంఎల్, వర్టిసేలియమ్ లకాన్ 5ఎంఎల్, వేప నూనె 5ఎంఎల్, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఒక వారం ఆర్గానిక్ మందులు, మరో వారం రసాయనిక మందులు పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

ఎరలు ఏర్పాటు

- సోలార్ దీపపు ఎరలు ఎకరానికి 4-5 ఏర్పాటు చేసుకోవాలి.
- నీలి రంగు జిగురు అట్టలు ఎకరానికి 20-30 ఏర్పాటు చేసుకుంటే పురుగుల ఉధృతిని అరికట్టవచ్చు.



చేనేత సహకార సంఘాలకు మళ్లీ ఇన్‌చార్జీలు

- మరో ఆరు నెలల గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు
- పర్సన్ ఇన్‌చార్జీలకు చేనేత సంఘాల బాధ్యతలు
- 12 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించని ప్రభుత్వాలు
- పాలకవర్గాలు లేక కునారిల్లుతున్న సంఘాలు

చేనేత సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జీలను మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 2013 ఫిబ్రవరిలో చేనేత సహకార సంఘాలకు చివరి సారిగా ఎన్నికలు జరిగాయి. 2018 ఫిబ్రవరి 12వ తేదీతో ఈ పాలకవర్గాల ఐదేళ్ల గడువు ముగిసింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించకుండా పర్సన్ ఇన్‌చార్జీలను నియమించింది. పర్సన్ ఇన్‌చార్జీలతో సంఘాలు మొక్కుబడిగా నడుస్తుండగా, క్యాష్ క్రెడిట్ అంతంత మాత్రంగానే ఉన్నాపలు సంఘాలు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయి.

- (ఆంధ్రజ్యోతి భూదాన్‌పోచంపల్లి)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 84 సంఘాలు ఉండగా అందులో ఉత్సాహంగా పనిచేస్తున్న సంఘాలు పదికి మించి లేవు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని ఆశపడిన చేనేత వర్గాలకు నిరాశే మిగిలింది. పర్సన్ ఇన్‌చార్జీల పాలనను మరో ఆరు నెలలు ఈ ఏడాది జూలై 20వతేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చేనేత, మరమగ్గాలు, ఉన్ని పారిశ్రామిక సహకార సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించి పుష్కర కాలం దాటింది. 2013 ఫిబ్రవరి 12నసంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. పాలకవర్గాల పదవీకాలం ముగియగానే ఎన్నికలు నిర్వహించకుండా ప్రతీ ఆరు నెలలకోసారి ప్రభుత్వాలు పర్సన్ ఇన్‌చార్జీల పాలనను పొడగిస్తూ వచ్చాయి. పర్సన్ ఇన్‌చార్జీల పాలన గతనెల 21న ముగియడంతో తిరిగి మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో చేనేతసహకార సంఘాల పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాత నియమించిన పర్సన్ ఇన్‌చార్జీల పదవీ కాలాన్ని ఇప్పటి వరకు 13 దఫాలు పొడిగించారు.

ఎన్నికలు లేక సహకార సంఘాలు డీలా

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేస్తే కార్మికులకు పని దొరుకుతుంది. మార్కెటింగ్ అవకాశాలు పెంపొంది కార్మికులకు గిట్టుబాటు లభిస్తుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో...

- మిగతా 7వ పేజీలో...

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ వ్యాప్తంగా 200 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, జిల్లాలో 37 ఉన్నాయని, అందుకు 50 మంది ప్రిసైడింగ్ అధికారులను, 50మంది పోలింగ్ అధికారులను నియమించి, వారికి శిక్షణ కూడా పూర్తి చేశామన్నారు. 22,439 ఓటర్ స్లిప్‌లకు, 3,358 వరకు పంపిణీ చేశామని, మిగతావి ఈ నెల 25లోగా పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 4,182 ఓటర్ స్లిప్‌లకు, ఇప్పటివరకు 501 పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికలకు జంబో బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నామన్నారు. 28వేల బ్యాలెట్ పేపర్లను వినియోగిస్తామని, వాటిని ఇప్పటికే పరిశీలించామని, నియోజవర్గం పరిధిలోని మిగతా జిల్లాలకు శనివారం తరలిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు బీఎస్ఎన్ఎల్‌కు వర్క్ ఆర్డర్ ఇచ్చామన్నారు. నల్లగొండ పట్టణం సమీపంలోని ఆర్జాలబావి గోదాము వద్ద ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, దీన్ని ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రత్యక్షంగా సందర్శించి ఆమోదం తెలిపారన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవర్ మాట్లాడుతూ జిల్లాలో 37 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఐదు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామన్నారు. 13 రూట్లు ఏర్పాటు చేశామని, అందుకు 15 స్టైకింగ్ ఫోర్స్, మూడు స్పెషల్ స్టైకింగ్ ఫోర్స్, 29 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 41 ఎంసీసీ బృందాలను నియమించామన్నారు. మొత్తం ఎన్నికలో 518 మంది పోలీసుల సేవలను వినియోగిస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు.

మాతా శిశు మరణాలు తగ్గాలి : కలెక్టర్

మాతా శిశు మరణాలను తగ్గించేందుకు కారణాలను విశ్లేషించాలని వైద్యాధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. మాతా శిశు మరణాలు సంభవిస్తే దీన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ విషయంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలది కీలకపాత్ర అని తెలిపారు. ఎక్కడైనా మాతా శిశు మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కట్టంగూరు, లైన్‌వాడ, కేతపల్లి, చిట్యాల, కనగల్, రాములబండ, మాన్యంచెల్క తదితర ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పరిధిలో గత ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు సంభవించిన మాతా శిశు మరణాలను సమీక్షించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ వందన, డాక్టర్ స్వరూపారాణి, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించాలి

హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్స్, బడ్డీ కొట్లు తదితర ప్రదేశాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్థాయి ఆహార భద్రత సమావేశంలో ఆమె మాట్లాడారు. చికెన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఫుడ్ సేఫ్టీ అధికారులు, పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి సంయుక్తంగా పనిచేయాలన్నారు. ఫుడ్ సేఫ్టీ జోనల్ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాలో 16 కేసులు నమోదు చేశామని తెలిపారు. సమావేశంలో ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి స్వాతి, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ కోటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీఏ శ్రావణ్, డీఈవో భిక్షపతి, ఎస్పీ డీఎస్పీ రమేష్, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాణించాలి

(ఆంధ్రజ్యోతి, మునుగోడు): విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో విద్యలో రాణిస్తేనే భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. చదువుకునే సమయంలో సెల్‌ఫోన్లను వాడటం సరికాదని అన్నారు. శుక్రవారం సాయంత్రం మునుగోడు బీసీ బాలుర, బాలికల హాస్టళ్లు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్ కార్యాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి చాక్లెట్ పంచారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ నరేందర్, తదితరులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా పంచ వింశతి కలశ స్నపనం

- మూడో రోజు మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు
- సీఎం పర్యటన ఖరారు.. ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



•7లో..

'కోడ్' మారడంతో నిలిచిన రుణమాఫీ

- జనవరి 1న ఏపీజీవీబీ నుంచి టీజీబీలో విలీనం
- మారిన ఐఎఫ్ఎస్ కోడ్
- ఖాతాల్లో జమకాని వైనం



•6లో..

నేడు 'మీట్ యువర్' ఎస్పీ

డిండి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం డిండి పోలీస్‌స్టేషన్‌లో శనివారం 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించే దిశగా ఉదయం 11 గంటలకు డిండి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే 'మీట్ యువర్ ఎస్పీ' కార్యక్రమానికి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ హాజరవుతారని తెలిపారు. బాధితుల ఫిర్యాదులు పరిశీలించి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. మండల ప్రజలు వారి సమస్యలపై ఎస్పీకి స్వయంగా ఫిర్యాదు చేయవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నర్సరీల్లో మొక్కలు ఎండకుండా చూడాలి : డీఆర్డీఏ



వన నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో మొక్కలు ఎండకుండా చూడాలని డీఆర్డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోల్‌ముంతలపహాడ్ గ్రామ పరిధిలోని వన నర్సరీని ఆయన పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం, నీటిని అందించే విధానంపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజురెడ్డి, ఏపీవో రామచంద్రనాయక్, కార్యదర్శి నరేందర్‌రెడ్డి, పలు పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు, సర్వీస్ రూల్స్ సాధనే ధ్యేయం

ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్ రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు, 317 పరిష్కారం, సర్వీస్ రూల్స్ సాధనే ధ్యేయంగా పని చేస్తానని వరంగల్-ఖమ్మం-నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్ రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక లయన్స్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్య పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. దశాబ్ద కాలంగా ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతూ, 18కి పైగా పోలీస్‌కేసులను అనుభవిస్తూ ఉద్యోగం, పెన్షన్ లేకున్నా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పనిచేశానన్నారు. రానున్న రోజుల్లో సీపీఎస్ రద్దు, 317 పరిష్కారం, ఉమ్మడి సర్వీసు రూల్స్ హెల్త్‌కార్డ్స్ పెండింగ్ డీఏలు, మంచి పీఆర్సీ సాధన లక్ష్యంగా ముందుకుసాగుతానన్నారు. గురుకుల ఉపాధ్యాయులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి 010 పద్దు కింద వేతనాలు, హెల్త్‌కార్డులు, ఇద్దరు హాస్టల్ వార్డెన్లను ఇప్పించడం, వచ్చే విద్యా సంవత్సరంలో 9గంటలకు పాఠశాల సమయాన్ని కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. జేఎల్, డీఎల్‌లకు గెజిటెడ్ హోదా, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 వేతనాలు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పేస్కేల్ వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పించేందుకు కృషిచేస్తానన్నారు. కేజీబీవీలో పనిచేసేవారికి పేస్కేల్, రూ.10లక్షల వరకు హెల్త్‌కార్డులు ఇప్పిస్తానన్నారు. ఎయిడెడ్ పాఠశాలను ప్రభుత్వ పాఠశాలల్లో కలపాలని మేనిఫెస్టోలో డిమాండ్ ఉంచామన్నారు. అదే విధంగా ప్రైవేట్‌విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకులకు ఆయా విద్యా సంస్థలు కూడా సమాన పనికి సమాన వేతనం కల్పించడం, జీపీఎఫ్ సౌకర్యం, హెల్త్ కార్డులు, గుర్తింపు కార్డులు, బ్యాంకుల ద్వారా వేతనాల కోసం కృషిచేస్తానన్నారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఉమాకర్‌రెడ్డి, వెంకన్న, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పైకమిచ్చుకో.. పనులు చేయించుకో!

- డిండి తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు

8

నేటి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

చింతపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లిలో సీతారామాంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠోత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శని, ఆదివారాల్లో నిర్వహించే ఉత్సవాలకు భక్తుల కోసం చలువపందిళ్లు, వసతి సౌకర్యాలు కల్పించారు. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల విద్యుత్ కాంతులతో లైట్లు, పువ్వులతో మండపాన్ని వైభవంగా ముస్తాబు చేశారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

డిండి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9, 10 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరి స్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28 లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 13. 04.2025న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

పైకమిచ్చుకో.. పనులు చేయించుకో !



డిండి తహసీల్దార్ కార్యాలయం అవినీతి రాజ్యమేలుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేతులు తడిపితేనే ఫైల్స్ కదలడం లేదని సమాచారం. దీం తో కార్యా లయం చుట్టూ తిరగలేక ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-డిండి)

- తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు
- కొంతమంది జేబు నింపుతున్న ధరణి మిస్సింగ్ నంబర్లు

ధరణిలో మిస్సింగ్ సర్వే నంబర్లు కొంతమంది రెవెన్యూ అధికారులకు కాసులు కురిపిస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిస్సైన సర్వే నంబర్లలో ఉన్న భూమి విస్తీర్ణాన్ని బట్టి ధరను నిర్ణయించి కార్యాలయంలో కొందరు రైతుల నుంచి అక్రమంగా డబ్బుల వసూళ్లు చేస్తున్నారని సమాచారం. గుంట భూమి మొదలుకొని ఎకరా వరకు రూ.50వేలు ఎకరాకు పైన ఉంటే లక్ష వరకు వసూళ్లు చేస్తున్నట్లు వినికిడి. రైతుల అమాయకత్వాన్ని బలహీనతను ఆసరాగా చేసుకున్న తహసీల్దార్ కార్యాలయంలో ముగ్గురు అధికారులు కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఒకరు అవినీతికి పాల్పడుతూ గత నెల 17న రెండోసారి ఏసీబీ అధికారులకు దొరికాడు. పనిష్మెంట్‌పై వచ్చి ఇక్కడ విధుల్లో చేరిన తీరు మార్చు కోలేదు. పైసలిస్తే నిబంధనలకు విరుద్ధంగా ఏపని చేయడానికైనా వెనుకాడడం లేదని పాత రికార్డులను మారుస్తూ తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన తహసీల్దార్లు సంతకాలు ఫోర్జరీతో ప్రొసీడింగులు తీసి ప్రభుత్వ భూములతోపాటు కోర్టు వివాదాలతో ఉన్న భూములకు కూడ పట్టాలు జారీ చేసినట్లు సమాచారం. గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని ఇద్దరు అధికారులు వసూళ్ల దందాను కొనసాగిస్తున్నారు. గతంలో మాన్యువల్‌గా పట్టాదార్ పాస్ పుస్తకాల్లో నమోదైన భూములు ధర ణిలోకి నమోదు కాలేదు. మండలంలో 38 గ్రామపంచాయతీల్లో మిస్సింగ్ సర్వే నంబర్లు, డేటా కరక్షన్ (టీఎం33), పేర్ల సవరణ, బ్యాక్‌లాగ్ రిజిస్ట్రేషన్, టీఎం4, టీఎం5, పీవోబీ, సమస్యలు, విస్తీర్ణం తక్కువగా ఉండడం, పట్టా భూములు ప్రభుత్వ భూములుగా నమోదు కావడం వంటి సమస్యలు పరిష్కారం కోసం 1,200 దరఖాస్తులు తహసీల్దార్‌కు రైతులు అందజేశారు. వీటిలో కొన్ని పరిష్కార ం కాగా మరికొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. డిజిటల్ పాస్‌పుస్తకాల్లో ఉండా ల్సిన భూమికంటే తక్కువగా ఉండడంతో ఆందోళన చెందిన రైతులు రెవెన్యూ అధికారులు అడిగినంత నగదు చేతిలో పెడుతున్నారు. తమ సమస్య పరిష్కారం కోసం నేరుగా కార్యాలయానికి వచ్చిన రైతులను ముందుగా అధికారులు ఇద్దరు బెదర కొడుతున్నారు. అంతేకాకుండా కార్యాలయం చుట్టూ తిరిగి విసిగెత్తిన రైతులు దళారీలను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని ఓ తండాకు చెందిన మాజీ ప్రజా ప్రతినిధి రూ.8 లక్షలు డిండి రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారుల్లో ఒకరికి ముట్ట చెప్పినట్లు సమాచారం. సదరు అధికారి బదిలీపై వెళ్తే నగదు ఇచ్చిన రైతులకు జవాబు చెప్పలేక తాను ఉరేసుకొని చావాల్సి వస్తుంది అనడం గమనార్హం.

మండలంలో 38 గ్రామపంచాయతీల్లో సుమారు 43వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సాగుకు భూములకు ధరలు పెరగడంతో తమ సెంటు భూమిని కూడ రైతులు జార విడుచుకోవడానికి ఇష్టపడడంలేదు. ఏవిధంగానైనా తమ భూమిని ధరణి లో నమోదు చేసుకునేందుకు చాలా ఖర్చు చేస్తున్నారు. ధరణి మిస్సింగ్ నంబర్ల పేరుతో డిండి తహసీల్దార్ కార్యాలయంలో రూ.కోటి వరకు చేతులు మారినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మకాం వేసి కార్యాలయంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్‌తో పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది.

అంతా నిబంధనలకు విరుద్ధంగానే..

నిబంధనల ప్రకారం ఐదు గుంట పైబడి భూమి ఉంటేనే తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చే యాల్సి ఉంటుంది. ఐదు గుంటల కంటే తక్కువ విస్తీర్ణం కలిగిన భూములను దేవరకొండ రిజిస్ట్రేషన్ కార్యాల యంలో ఇళ్ల స్థలాలుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటు ంది. వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ సమయంలో సం బంధిత భూమిపై ఎలాంటి రుణాలు లేనట్లుగా బ్యాంక్ అధికారుల నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ సర్టిఫికెట్ లేకుండానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కళ్యాణ లక్ష్మి చెక్కులు జారీ చేసేందుకు రూ.5వేలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం రూ.500 నుంచి రూ. 6 వేల వరకు, బ్యాంక్ నుంచి నోడ్యూ సర్టిఫికెట్ తేని యె డల రూ.3వేల నుంచి 10వేల వరకు కార్యాలయంలో వసూళ్ల చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇనాం భూములను కూడా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు సమాచారం.

దళారీలతో వెళితేనే పనులు



డిండి తహసీల్దార్ కార్యాలయంలో దళారీలతో వెళ్తేనే ఏపనైనా అవుతుంది. రైతులు కార్యాలయానికి వస్తే పనులు కావడం లేదు. తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదు.

- మాణిక్యమ్మ, కాటికబండతండా

అవినీతిమయంగా మారింది



డిండి తహసీల్దార్ కార్యాలయంలో అవినీతిమయంగా మారింది. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ మొదలుకొని కల్యాణలక్ష్మి ధరణి సమస్యల కోసం రైతుల నుంచి ఉద్యోగులు డిమాండ్ చేసి వసూళ్లు చేస్తున్నారు. కార్యా లయానికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండడం లేదు. రైతులు వ్యవసాయ పనులు వదులుకొని కార్యాలయానికి రావలసి వస్తుంది.

- శంకర్, పడమటితండా

ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటాం



అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు చేస్తే ఉద్యో గులపై చర్యలు తీసుకుంటాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. కొందరు అవినీతికి పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చింది. పద్ధతి మార్చుకోకపోతే చర్యలుంటాయి.

- రమణారెడ్డి, ఆర్డీవో, దేవరకొండ

మచ్చుకు కొన్ని..

మండలంలో గ్రామపంచాయతీల్లో ఏ తలుపు తట్టిన తహసీల్దార్ కార్యాలయంల అధికారులకు తమ సమస్యల పరిష్కారం కోసం నగదు ముట్టచెప్పినట్లు చెబు తున్నారు.

- రామంతపూర్ గ్రామానికి చెందిన ఓమహిళ రూ. 40వేలు కార్యాలయంలో ఒక అధికారికి చెల్లించినట్లు తెలుసోతంది. వావిల్‌కోల్ గ్రామానికి చెందిన వితంతువు నుంచి ధరణిలో ఉన్న సమస్య పరిష్కారం కోసం రూ.40వేలు చెల్లించినట్లు తెలుస్తుంది.
- ఖానాపూర్ గ్రామానికి చెందిన ఓరైతు తన వ్యవ సాయభూమిలో కొంత భాగాన్ని విక్రయించాడు. రిజిస్ట్రేషన్ సమయంలో విక్రయించిన భూమిపై బ్యాంక్‌లో ఎలాంటి రుణం పొందలేదని బ్యాంక్ అధికారుల నుంచి నోడ్యూ సర్టిఫికెట్ తేవాలని అధికారులు ఆదేశించారు. తన వద్ద అంత డబ్బులేదని చెప్పడంతో ఆ రైతు నుంచి రూ. 10 వేలు తీసుకొని రిజిస్ట్రేషన్ చేశారు. నిజాంనగర్‌కు చెం దిన ఇద్దరు రైతుల నుంచి రూ.3లక్షలు డిమాండ్ చేసి రూ.2లక్షలు ఓ రాజకీయ పార్టీ నాయకుని ద్వారా తీసు కున్నట్లు సమాచారం.
- బొలనపల్లి గ్రామానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధి నుంచి తమ 36 గుంటల భూమిని ఆన్‌లైన్ చేసేందుకు రూ.50వేలు తీసుకున్నట్లు సమాచారం. ఇదే గ్రామానికి చెందిన ఓమైనార్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి నుంచి రూ.2.40 లక్షలు తీసుకున్నట్లు సమాచారం.
- బ్రాహ్మణపల్లికి చెందిన ఓ రైతు ఎకరా భూమి మిస్సింగ్ సర్వేనంబర్‌లో నమోదైంది. తన భూమిని ధరణిలో చేర్చి డిజిటల్ పాస్ పుస్తకం జారీ చేసేందుకు ఆరు నెలల క్రితం మధ్యవర్తి ద్వారా రూ.50వేలు చెల్లిం చినట్లు తెలుస్తోంది.
- ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య భూ వివాదం నెలకొని కోర్టు వరకు వెళ్లారు. కోర్టులో వాయిదా నడుస్తున్నప్పుడు వివాదంలో ఉన్న భూమికి సంబంధించి ఎలాంటి పట్టాలు జారీ చేయ రాదని నిబంధనలు ఉన్నప్పటికీ రూ.1.50లక్షలకు ఒప్పం దం కుదుర్చుకొని డిజిటల్ పాస్‌పుస్తకం జారీ చేసి నట్లు తెలుస్తుంది.
- బొలనపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు సర్వేనంబర్ 264లో రెండు ఎకరాల భూమిని పట్టా చేసేందుకు రూ.50వేలు చెల్లించినట్లు తెలుస్తుంది.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల అవసరాల కోసం గ్రామపంచాయతీ కార్యదర్శి అనుమతితో ట్రాక్టర్‌కు రూ.100 చెల్లించి ఇసుకను తరలించవచ్చని, ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల లోపు ఇసుకను రవాణా చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే మొదటిసారి రూ.5వేలు, రెండోసారి అతిక్రమిస్తే రూ.15వేల వరకు జరిమానా విధిం చడంతో పాటు రెండు నెలలు ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీవో స్వామి, ఎస్‌ఐ కృష్ణయ్య, ఎంపీవో సంగీత ఉన్నారు.

శాస్త్ర విజ్ఞానంతో సామాజిక పరిజ్ఞానం



ప్రదర్శనను తిలకిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ, మునీర్

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శాస్త్ర విజ్ఞానంతోనే సామాజిక పరిజ్ఞానం కలుగుతుందని ప్రముఖ వైద్యుడు డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో జూనియర్ జీనియస్ పేరుతో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశీలన, ప్రయోగాల వ్యవస్థనే సైన్స్ అంటారన్నారు. కాగా పాఠశాల విద్యార్థుల వాటర్ హార్వెస్టింగ్, గణిత నమూనాలు, డయాలసిస్, ట్రాన్స్‌పోర్ట్, హైడ్రోపోనిక్, అగ్రికల్చర్, గ్రామర్, సోలార్ సిస్టం తదితర అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలను తిలకించేందుకు పట్టణ, పరిసర ప్రాంత విద్యార్థులు తరలివచ్చారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మునీర్, పాఠశాల ప్రిన్సి పాల్ కేకే. జయరాజన్, డైరెక్టర్ జిన్సీజయరాజన్, ఐఐటీ విభాగాధిపతి యరగాని ప్రసాద్, హెచ్‌ఎం సుజయ్‌కుమార్, ప్రైమరీ ఇన్‌చార్జి రాధిక పాల్గొన్నారు.

పనిచేసే వారిని గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

దేవరకొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పనిచేసేవారిని గుర్తించి గెలిపించాలని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి కోరారు. పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగలి శ్రీపాల్‌రెడ్డికి మద్దతుగా దేవరకొండ డివిజన్‌లో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక విశ్రాంత ఉద్యోగ సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డీబీఎస్ ఫణికుమార్, సుంకరి మల్లేష్‌గౌడ్, జానారెడ్డితో కలిసి మాట్లాడారు. గత ఎమ్మెల్సీలు తమ స్వప్రయోజనాల కోసం పార్టీలు మారడమే తప్పా ఉపాధ్యాయులకు చేసిందేమిలేదన్నారు. శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు. సమావేశంలో నర్సింహరెడ్డి, రవీందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, దామోదర్, లోక్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, నరేందర్‌రెడ్డి, నారాయణసింగ్ పాల్గొన్నారు.

భక్తాంజనేయుడికి క్షీరాధివాసం



క్షీరాధివాసంలో పాల్గొన్న ఆంజనేయ మాలధారులు

హాలియా, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హాలియాలోని స్వయంభూ భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామివారికి క్షీరాధివాసం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులకు బండి లక్ష్మీనారాయణ దాత సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సురభి రాంబాబు ఆధ్వర్యంలో సంఘం తరుపున 25,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ మేడేపల్లి మోహన్‌రావు, గౌరవాధ్యక్షుడు కాకునూరి నారాయణగౌడ్, పారిశ్రామికవేత్త చిట్టిపోలు యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్ర శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'కాకతీయ'లో మాతృభాషా దినోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణ ంలోని కాకతీయ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినో త్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ చీదళ్ల వెంకట్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి మాతృభాషపై పట్టు ఉండాలని అన్నారు. అనంతరం మాతృభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు, పెరెంట్స్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

హాలియా, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హాలియా ఎస్‌ఐ సతీష్‌రెడ్డి అన్నారు. ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో హాలియా పట్టణంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు దాదాపు రూ. 30 వేలతో రెండు చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేసిన అనిల్‌కుమార్‌ను, ఫౌండేషన్ సభ్యుల సేవలను అభినదించారు. కార్యక్రమంలో సాయి బృందావన్ కాలనీ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది జానీ మైకల్, మన్నెం కోటి, మోకారాల అనిల్, గంగుల అంజియాదవ్, మేకల శివయాదవ్, కొత్తపల్లి ప్రసాద్‌ముదిరాజ్, వల్లందాసు సైదులుగౌడ్, అనుముల మధు, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



హాలియా సెంటర్లలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని కోదండపురం వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనం తరం ఆలయ కమిటీ ఎమ్మెల్యే బాలునాయక్‌ను శాలువాతో సన్మానించి యాదగిగుట్ట లక్ష్మీ నర్సింహ స్వామి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గజ్జెల వెంకటేశ్వర్‌రెడ్డి, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, నెర్మటి సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, మాధవరావు, ఆలంపల్లి నర్సి హ పాల్గొన్నారు.

పాండురంగారెడ్డికి నివాళి

చింతపల్లి :మండలంలోని కుర్మపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సమ్మిడి పాండు రంగారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే బాలునాయక్ గ్రామంలో పాండురంగారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ దొంతం అలివేలూ సంజీవ రెడ్డి, మాజీ ఎంపీపీ కొండూరి భవానీ పవన్ కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగి రేకుల నాగ భూషణ్, మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, మాస భాస్కర్, ప్రధాన కార్యదర్శి ఎరుకుల వెంకటయ్యగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌యాదవ్, కాయితి జితేందర్‌రెడ్డి, ఆశోక్ పాల్గొన్నారు.

దర్గా వద్ద భక్తుల సందడి

చింతపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండ లంలోని పీ.కే.మల్లేపల్లిలో శని, ఆదివారం జరగనున్న హజరత్ అబ్బాస్‌దర్గాలో ఉర్సుకు శుక్రవారం నుంచి భక్తుల సందడి మొ దలైంది. రాత్రి 12 నుంచి తెల్లవారుజామున 3 గంటల వరకు ముత్తవలి మహమ్మద్ చాంద్ పాషా ఆధ్వర్యంలో ఒంటెపై జన సందోహం మధ్య పురవీధుల్లో ఊరేగింపుతో దర్గాకు చేరుకుంటారు. దీంతో ఎక్కడ చూసిన భక్తుల కోలాహలం సంతరించుకుంది.

కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

దర్గా పైభాగంలో నిర్మించిన మక్కా మహేశ్వర ఆలయ 22వ వార్షికోత్సవం సందర్భం గా శనివారం కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. హిందు-ముస్లింలు దర్గా- ఆలయానికి భక్తులు వస్తుండటంతో మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది.

మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

దామరచర్ల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిపై మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో టీడీపీ కార్యకర్తలు జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎవరైనా టీడీపీ గురించి, ఆ పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చ రించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పడిగపాటిరాంరెడ్డి, గోపికృష్ణ, మాన్యనాయక్, జాని, నాగుల్ మీరా, లక్ష్మణ్, నరసింహారావు, జంగయ్య పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే చంద్రబాబుపై విమర్శలు

మిర్యాలగూడ టౌన్ : బీఆర్ఎస్ రాజకీయ లబ్ధి కోసమే ఏపీ సీఎం చంద్రబాబునాయుడిపై విమర్శలు గుప్పిస్తోందని టీడీపీ జాతీయ క్రమశిక్షణ సంఘ సభ్యుడు, నియోజకవర్గ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ అన్నారు. మిర్యాలగూడలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ అండ్ కో మిగులు నిధులతో ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రాన్ని జైలులో ఉన్న వైసీపీ జగన్‌తో చేతులు కలిపి దొంగల్లాగా దోచుకు తిన్నారన్నారు. విసుగు చెందిన ఇరు రాష్ట్రాల ప్రజలు అటు జగన్‌ను, ఇటు కేసీఆర్‌ను గద్దె దింపినా బుద్ధి రాలేదన్నారు. సంబంధం లేని అంశాల్లోకి చంద్రబాబును లాగి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. రాజధాని హైదరా బాద్‌తో పాటు ఉమ్మడి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత చంద్ర బాబుదేనన్నారు. గతంలో బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు చంద్రబాబు చేసిన అభివృద్ధిని పొగిడారని గుర్తు చేశారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మాజీ జీఎం విమర్శించడం సరికాదని టీడీపీ జిల్లా నాయకుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డెబోయిన శ్రీనివాస్, నుసుం నగేష్ పాల్గొన్నారు.

పశుసంవర్ధక శాఖ జేడీగా రమేష్

నల్లగొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్‌గా రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి జేడీ ఖాద్రీ బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రమేష్ నాగర్‌కర్నూల్ నుంచి పదోన్నతిపై బదిలీపై జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా రమేష్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జ్యోతి ఆసుపత్రిలో అరుదైన చికిత్స



తక్కువ బరువుతో జన్మించిన శిశువును చూపుతున్న వైద్యబృందం

మిర్యాలగూడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జ్యోతి ఆసుపత్రి వైద్యబృందం అరుదైన విజయాన్ని నమోదు చేసింది. 25 వారాలకు అతితక్కువ బరువుతో జన్మించిన ఆడశిశువును ఆధునిక వైద్యసేవలతో 69 రోజులు చికిత్స అందించి 1.4 కేజీల బరువు పెంచి పూర్తి ఆరోగ్యంతో శనివారం ఆసుపత్రి నుంచి వె ద్యు లు డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జ్యోతి ఆసుపత్రి వైద్యురాలు ముప్పా జ్యోతి మాట్లాడుతూ నల్లగొండ మండలం చిన్న సూరారం గ్రామానికి చెందిన ఎర్రఅశోక్, రమ్య దంప తులకు మొదటి కాన్పులో శిశువు అబ్‌నార్మల్‌గా ఉం డటంతో అబార్షన్ చేశారు. రెండో కాన్పులో 6 నెలల 11 రోజులకు నొప్పులు రావడంతో టెస్ట్ కోసం జ్యోతి ఆసుపత్రికి వచ్చినట్లు చెప్పారు. పరీక్షలు చేయగా శిశువు బలంగా లేనట్లు తేలిందన్నారు. దంపతుల అభ్యర్థన మేరకు ఆరోగ్యశ్రీ కింద ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స ప్రారంభించామని అన్నారు. డిసెంబర్ 14న సాధారణ ప్రసవం కాగా అరచేతి సైజులో 850 గ్రాములు మాత్రమే శిశువు బరువు వున్నట్లు తెలిపారు. అలాంటి బిడ్డ బతకడానికి హైదరా బాద్ లాంటి నగరాల్లో రెండు మూడు ఆసు పత్రుల్లో మాత్రమే సాధ్యమవుతుందని అలాంటింది మిర్యాలగూడలాంటి ప్రాంతంలో ఆ ఘనత సాధించినందుకు వైద్య బృందానికి, సహకరించిన దంపతులకు ధన్యవాదాలు తెలి పారు. పీడియాట్రిక్ వైద్యులు వేణుగోపాల్, రమేశ్ మాట్లాడుతూ శిశువు తల్లి గర్భంలో కనీ సం 32 వారాలు ఉంటేనే అన్ని అవయవాలు పనిచేస్తాయన్నారు. 25 వారాలకే పుట్టిన బిడ్డ ఊపిరితిత్తులు తెరుచుకోనందున శ్వాస కష్టం అవుతుందని, తల్లిపాలు తాగలేదని అన్నారు. 6 రోజులు వెంటిలేషన్‌లో వుంచి, 10 రోజులు సిపాప్ చేసి వారం రోజుల పాటు ఆక్సిజన్ ఇచ్చి హైదరాబాద్ నుంచి తెప్పించిన ప్రత్యేక పాలతో ఫీడింగ్ ఇచ్చి 69 రోజుల పాటు బిడ్డను కంటికి రెప్పలా కాపాడి కళ్లు , మెదడు పరీక్షలు జరిపి ఆరోగ్యంగా ఉన్నందున డిశ్చార్జి చేస్తున్నట్లు తెలిపారు. ఏడాదిన్నర కాలంలో తక్కువ బరువుతో జన్మించిన 75 మంది శిశువుల్లో 71 మందిని బతికించగలిగామని అన్నారు. ఈ సందర్భంగా దంపతులు అశోక్, రమ్య మాట్లాడుతూ ఎంతో శ్రమించి మా బిడ్డను బతికించిన ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు సమావేశంలో గైనకా లజిస్ట్, ఇన్‌ఫెర్టిలిటీ ప్రతేక వైద్యనిపుణురాలు డాక్టర్ ముప్పా అమూల్య, సిబ్బంది డేగ వీటి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం

మాడ్గులపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ సమస్యలు పరిష్కారం కాక తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరు గుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మిస్సింగ్ సర్వే నంబర్లు, మ్యూటేషన్, ఫౌతీల దరఖాస్తులను పరిష్కారం చేయాలని రైతులు కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నా పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పుల్లెంల శ్రీకర్, బొమ్మకంటి అంజయ్యనాగయ్య, వెంకట్ రెడ్డి రవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

చింతపల్లి: ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమ య్యాయని సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. త్వరలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయిన రైతు లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



మాడ్గులపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న రొండి శ్రీనివాస్